
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శుక్రవారం 22 మార్చి 2024 | 5

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శుక్ర) సా.6.23
సహరి(శని) ఉ.4.44

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	36.0	22.0

వలంటీర్లపై వేటు



ఎన్నికల కమిషన్ ఆదేశాలు బేఖాతర్ చేశారు.. ఎప్పుడూ పిలిచినట్టే నాయ కుడు పిలిచాడు కదా అని ఎరక్కపోయి వెళ్లి ఇరుక్కుపోయారు.. రాజ మహేంద్రవరం ఎంపీ భరత్‌రామ్ అత్యుత్సాహానికి ఏకంగా 23 మంది వలంటీర్లు బలైపోయారు. దిక్కుతోచని స్థితిలో వలంటీర్లు గిజగిజలాడి పోతు న్నారు. నేతల ఒత్తిళ్లకు లొంగి చివరకు బలి పశువులుగా మారిపోయారు. అయితే సమావేశం నిర్వహించిన ఎంపీ భరత్‌పై నేటి వరకూ చర్యలు లేకపోవడంపై వలంటీర్లు మండిపడుతున్నారు.

23 మంది సస్పెన్షన్

- ఈసీ ఆదేశాలు బేఖాతర్
- ఎంపీ మీటింగ్‌కు వెళ్లడమే కారణం
- ఆర్‌వోకు అందిన ఫిర్యాదు
- 24 గంటల్లో విచారణ పూర్తి
- 44వ డివిజన్ వలంటీర్లపై చర్యలు
- ఎంపీని వదిలేసిన అధికారులు?
- విచారణ పేరుతో జాప్యం
- మండిపడుతున్న బాధితులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఎన్నికల సమయంలో వలంటీర్లను వినియోగించవద్దని ఎన్నికల కమిషన్ ప్రత్యేకించి హెచ్చరించినా వైసీపీ నేతలు పట్టించుకోవడం లేదు. రాజమహేంద్రవరంలో ఈ నెల 19వ తేదీన ఎంపీ భరత్ రామ్ నిర్వహించిన రహస్య సమావేశానికి 44 డివిజన్‌కు సంబంధించిన 23 మంది వలంటీర్లు వెళ్లారు. ఇదే పెద్ద చిక్కు తెచ్చి పెట్టింది. వలంటీర్ల సస్పెండ్ చేయించింది. 44వ వార్డు 76వ సచివాలయంలో 10 మంది, 77వ సచివాలయంలో 13 మంది వలం టీర్లను సస్పెండ్ చేసినట్టు ఆర్‌వో దినేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వలంటీర్లను ఇప్పటి వరకూ పింఛన్లు పంపిణీ, అధికార వైసీపీకి అవసరమైన సమాచారాన్ని సేకరించడం తదితర కార్యక్రమాలకు ఉపయోగించుకున్నారు. వైసీపీ మీటింగ్‌లకు వాళ్లే కీలకంగా వ్యవహరించేవారు. చాలా వరకూ జనసమీకరణ చేసేవారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కోర్టు ఆదేశాలతో వలంటీర్లు ఎన్నికలకు దూరం ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడే వైసీపీ నాయకులకు అసలు చిక్కు వచ్చిపడింది. నిన్నటి వరకూ నాయకులు కార్యకర్తలను పట్టించుకోకుండా వలంటీర్లకే పెద్దపీట వేసేవారు.వైసీపీ కార్యకర్తలను పట్టించుకోలేదు. దీంతో ఎన్నికల వేళ వైసీపీ నాయకులు ప్రచారం చేయడానికి డబ్బులిస్తేనే కానీ కార్యకర్తలు ముందుకు రాని పరిస్థితులు ఉన్నాయి.

కార్యకర్తలు కినుక..

వార్డులు, గ్రామాల్లో ఎక్కువ మంది వలంటీర్లకే పరిచయం. పింఛన్లు, ప్రభుత్వ పథకాలపై అమలుపై గత ఐదేళ్లుగా జనంతో ఉన్నారు. దీంతో ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులంతా ప్రతి విషయానికి వలంటీర్ల మీదే ఆధారపడుతున్నారు. అయితే వలంటీర్లను ఎన్నికల్లో దూరంగా ఉంచాలని కోర్టు ఆదేశించడంతో వైసీపీ గొంతులో వెలక్కాయ పడినట్టు అయింది. కానీ దేన్నయినా ధిక్కరించే నైజం అలవరచుకున్న కొందరు వైసీపీ నేతలు వలంటీర్ల మీద ఒత్తిడి తెచ్చి ఇంటింటా ప్రచారం చేయించుకునే పనిలో ఉన్నారు. అధికార వైసీపీ నేతల ప్రలోభాలకు,ఒత్తిళ్లకు లొంగి వైసీపీ మీటింగ్‌లకు హాజరవుతున్నారు. ఈ వ్యవహారం బయటకు వస్తుండడంతో వలంటీర్లు ఎన్నికల కమిషన్ వేటుకు గురవుతున్నారు.

వల వేసినా..

వలంటీర్లుగా పనిచేస్తూ ప్రభుత్వం నుంచే ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రూపంలో గౌరవ వేతనం పొందుతున్నారు.ఈ పరిస్థితుల్లో వలంటీర్లు రాజకీయ పార్టీకి ఎలా పనిచేస్తారని ప్రశ్నించి వారిని ఎన్నికల కమిషన్ దూరం పెట్టిన సంగతి తెలిసిందే. నాయకులతో కలిసి వెళితే కేసులు పెడతామని,జైలుకు పంపిస్తామని హెచ్చరించింది. జిల్లాలో 9300 మంది వలంటీర్లు ఉండేవారు. ప్రస్తుతం 8 వేల మంది ఉన్నారు. వారందరికీ ఇటీవల వైసీపీ నేతలు నియోజకవర్గాల వారీ గిఫ్టులు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. ఎన్నికలు దగ్గరకు వచ్చే సమయంలో డబ్బు కూడా ఇస్తామని ప్రలోభాలు పెట్టిన సంగతి తెలిసిందే. ఇటీవల సిటీ వైసీపీ అభ్యర్థి, ఎంపీ మార్గాని భరత్ బూత్‌కమిటీ పేరుతో ఏర్పాటు చేసిన మీటింగ్‌లకు వలంటీర్లు హాజరయ్యారు.ఈ విషయం బయటకు రావడంతో పాటు టీడీపీ అభ్యర్థి ఆదిరెడ్డి వాసు కమిషనర్, సిటీ ఆర్వో కె.దినేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఆరా తీసి 23 మంది వలంటీర్లను సస్పెండ్ చేశారు. దీంతో వలంటీర్లతో పాటు వైసీపీ ఖంగుతిన్నది. ఈ నేపథ్యంలో మిగతా వలంటీర్లు అలర్ట్ అయ్యారు. గతంలో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించిన ఉద్యోగుల్లో కూడా ఆందోళన మొదలైంది. ఇటీవల భూములు సేకరించకుండానే వేలాది మంది లబ్ధిదార్లకు పట్టాలు పంపిణీ చేసిన రెవెన్యూ అధికారులపై కూడా ఫిర్యాదులు చేయడానికి ప్రతిపక్షాలు సిద్ధమవుతుండడం గమనార్హం.

ప్రచారానికి అనుమతి తప్పనిసరి

సువిధ వెబ్ పోర్టల్ అనుమతిపై 25 అంశాల్లో చెక్‌లిస్ట్

రాజమహేంద్రవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం ప్రచారాలకు రాజకీయ పార్టీల నాయకులు 'సువిధ' వెబ్ పోర్టల్ ద్వారా అనుమతి కచ్చితంగా పొందాలని అడిషనల్ ఎస్పీ పి.అనిల్ కుమార్ పేర్కొన్నారు. ఇంటింటి ప్రచారం, ర్యాలీ, బైక్ ర్యాలీ ఇలా మొత్తం 25 అంశాల్లో చెక్‌లిస్ట్ ఉందని చెప్పారు. అనుమతులు పొందకుండా కార్యక్రమం నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇప్పటికే జిల్లాలో ఐపీసీ సెక్షన్ 188, ఇండియన్ పోలీస్ చట్టంలోని సెక్షన్ 30 అమల్లో ఉన్నాయని చెప్పారు. పోలీసులు ముందస్తు అనుమతుల్లేకుండా ర్యాలీలు,సభలు, సమావేశాలు నిర్వహించడం నిషిద్ధమన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎలాంటి పనులు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆసరా, అంతేగా!



బటన్ నొక్కి మూడు వారాలైనా అందని సొమ్ములు

- లబ్ధిదారుల ఎదురుచూపులు
- 50 శాతమూ జమకాని వైనం
- జిల్లాలో 32,707 గ్రూపులు
- జమైన వారి లెక్కలూ లేవు
- వస్తుందో రాదోనని ఆందోళన
- ఎన్నికల వేళ ఓటు రాజకీయం?
- నగదు జమైతే..ఓటుకు లింక్..
- డ్వాక్రా మహిళలకు ఇదో ఎర

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

తెల్లారితే అప్పులతో ముఖం కడుక్కునే దుస్థితిలో ఉన్న జగన్ జమానాలో బటన్ నొక్కినంత వేగంగా, సులభంగా పనులు మాత్రం జరగడం లేదు. ఈ నాలుగేళ్ల పది నెలల పాటు రుణాలతో దర్పం ప్రదర్శిస్తూ వచ్చారు. దొరికిన చోటల్లా చేయి చాచారు. చివరికి భవిష్యత్తులో విక్రయించే మద్యంపై కూడా అప్పు లాగేసినా, సచివాలయాలను తాకట్టు పెట్టేసినా అది వైసీపీ సర్కారుకే చెల్లింది. ఇప్పుడు ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో జగన్ ప్రభుత్వంలో గల్లాపెట్టే డొల్లతనం బయట పడుతోంది. పైసా పుట్టడం కష్టతరం కావడంతో 'ఆసరా' సొమ్ములు నీరసంగా జమ అవుతున్నాయి. నాలుగో విడత ఇదిగో అంటూ జగన్ బటన్ నొక్కి మూడు వారాలు గడిచినా 50 శాతం మందికి కూడా రుణ మాఫీ సొమ్ములు బ్యాంకుల్లో జమ కాలేదు.

అసలు వస్తుందా?

ప్రభుత్వం వద్ద సొమ్ములు లేవనే విషయం బహిరంగ రహస్యం. ప్రతి రోజూ అప్పులు చేస్తే గానీ పూట గడవని దుస్థితిలో ఆర్థికం కొట్టుమిట్టాడుతోంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దొరికిన చోటల్లా అప్పులు చేస్తూ వచ్చారు. ఈ నెల 16 నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేసింది. ఇప్పటి వరకూ అధికారాన్ని అడ్డుపెట్టుకుని చేయి చాచడంతో నయానో, భయానో రుణం పుట్టేది. జగన్ ప్రభుత్వంపై నమ్మకం లేకపోవడంతో ఇప్పుడు రుణదాతలు పైసా విదిల్చే పరిస్థితి లేదు. ఆ ప్రభావం పథకాలపై పడుతోంది. ఆసరా రుణమాఫీ సొమ్ములు నాలుగో విడత విడుదలకు మార్చి 1న జగన్ ఆర్భాటంగా ఎప్పుడు మాదిరిగానే బటన్ నొక్కి నాలుగు మాటలు చెప్పి ప్యాలెస్‌కి వెళ్లిపోయారు. తర్వాత ఆ సొమ్ములు జమ చేయడానికి సాంకేతిక కారణాలు చూపిస్తూ కాలాన్ని గెంటుతున్నారు. ఎన్నికల సంఘం చెప్పినా లెక్కచేయకుండా వలంటీర్లను ఎన్నికల ప్రచారానికి వినియోగిస్తుండడంతో కేవైసీ తదితర అడ్డంకులు దాటడానికి లబ్ధిదారులు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. 2020-21 నుంచి నాలుగు విడతలుగా రుణమాఫీ సొమ్ములు జమ చేస్తామని జగన్ చెప్పారు. ఏడాదికి ఒక విడత చొప్పున జమ చేస్తున్నారు. ఈ నెలలో చివరి విడత జమ కావాల్సి ఉంది. దీనిలో భాగంగానే సీఎం బటన్ నొక్కారు. అయితే నేటికీ డబ్బులు జమకాలేదు.

జిల్లాలో 32,707 గ్రూపులు

తూర్పు గోదావరి జిల్లాలో నాలుగో విడతకు సంబంధించి 32,707 గ్రూపుల్లో 3,27,070 మందిని ఆసరా(వైఎస్ఆర్‌కేపీ) లబ్ధిదారులుగా గుర్తించారు. వీరికి సంబంధించి బ్యాంకు ఖాతాల్లో రూ.1105.87 కోట్లు జమ కావాల్సి ఉంది. కానీ 50 శాతం కూడా పూర్తి కాలేదని తెలుస్తోంది.

ప్రలోభానికా..?

ఎన్నికల సందర్భంగా ఏ ప్రలోభాన్నీ వైసీపీ ప్రభుత్వం వదలడం లేదు. ఏ పథకంలో అర్హుదారులనైనా ఓటుతో ముడిపెడుతున్నారు. నాలుగేళ్ల పది నెలల్లో సంక్షేమ పథకాల ద్వారా పరోక్షంగా, ప్రత్యక్షంగా చేసిన సహాయాన్ని లెక్క గట్టి సొంత సొమ్ము ఇచ్చినట్లుగా బిల్డప్ ఇస్తున్నారు. కుడి చేతిలో సొమ్ము పెట్టి ఎడమ చేతితో లాగేసుకోవడం వైసీపీ ప్రభుత్వంలో మరో మెలిక. ఇప్పుడు ఆసరా సొమ్మును కూడా ఓట్లతో బేరీజు వేస్తున్నారు. ఆసరా సొమ్మును నెమ్మదిగా వేస్తూ జమ అయిన లబ్ధిదారుల వద్దకు వెళ్లి ఓటు వేయాలంటూ డిమాండ్ చేయాలని వైసీపీ నాయకులు వలంటీర్లు, ఆర్పీలు, సీఆర్పీలపై ఒత్తిడి తెస్తున్నారని సమాచారం. దీంతో బ్యాంకు ఖాతాలో జమ అయిన వారి వివరాలు తెలుసు కుని ఓటు వేయాలని లేకపోతే ఈ లబ్ధి ఉండ దంటూ ప్రలోభ పెడుతున్నారు. ఎన్నికల సమ యం ఆసన్నమయ్యే వరకూ ఇలా కాలయాపన చేస్తే ఓట్లు దండుకోవచ్చనే కుయుక్తి ఈ పథ కంలోనూ ఉందనే ఆరోపణలు వినవస్తున్నాయి.

మండలాల వారీగా చూస్తే.. అనపర్తి 1310, బిక్కవోలు 1522(మొదటి విడతలో 1523), చాగల్లు 1234, దేవరపల్లి 1660(1661), గోకవరం 1465, గోపాలపురం 1465, కడియం 1538, కోరుకొండ 1575, కొవ్వూరు 1324(1325), నల్లజర్ల 1620, నిడదవోలు 1438, పెరవలి 1531, రాజమహేంద్రవరం రూరల్ 2635, అర్బన్ 3997, రాజానగరం 2089, రంగంపేట 1170, సీతానగరం 1632, తాళ్లపూడి 1117, ఉండ్రాజవరం 1299(1300), కొవ్వూరు 545, నిడదవోలులో 540 గ్రూపుల్లోని మహిళలకు రుణమాఫీ జమకావాల్సి ఉంది. కానీ ఏ ఒక్క మండలంలోనూ పూర్తి స్థాయిలో ఇప్పటి వరకూ ఆసరా అందలేదు.

ఎందుకు గోప్యత

ఆసరా ఎందరి ఖాతాల్లో జమ చేశారన్న విషయం గోప్యంగా ఉంచుతున్నారు. ఖాతాలో నేరుగా జమ చేస్తున్నందున సదరు లబ్ధిదారుడికి మాత్రమే ఫోన్ ద్వారా సమాచారం అందుతుందని తమ వద్ద వివరాలు ఉండవని, అందువల్ల లెక్కాపత్రం తెలియదని అధికారులు సమాధానమిస్తున్నారు. మరోవైపు తమ పరిధిలో ఉన్న గ్రూపుల్లో ఎందరికి రుణమాఫీ సొమ్ములు పడ్డాయో రిసోర్స్ పర్సన్(ఆర్పీ)లకు కూడా తెలియదంట. దీంతో నెమ్మదిగా జమ చేస్తున్నారనే సమాధానం ఎదురవుతోంది. జిల్లాలో ఇప్పటి వరకూ ఎంత మందికి రుణమాఫీ నాలుగో విడత వర్తించిందో, ఇంకా ఎందరు ఎదురు చూస్తున్నారో జిల్లా స్థాయి అధికారులకు తెలియదు.

పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు ఉండాలి

జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ ఆదేశం



రాజమహేంద్రవరం రూరల్ మార్చి 21 : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రూరల్ నియోజకవర్గ పరిధిలో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రూరల్ ఆర్వో జేసీ తేజ్ భరత్ ఆదేశించారు. రూరల్ మండల పరిధి కోలమూరులో గల పోలింగ్ స్టేషన్-40ని అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బూత్ స్థాయి అధికారి పేరు, ఫోన్ నెంబరు అందుబాటులో ఉంచాలన్నారు. పోలింగ్ కేంద్రంలో బాత్‌రూమ్‌లు లేవంటూ ఫిర్యాదు రావడంతో తక్షణమే వాటిని ఏర్పాటు చేయాలంటూ అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రం పరిధిలో 85 ఏళ్ల దాటిన ఓటర్ల వివరాలను సేకరించి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. హోం ఓటింగ్‌కు కోసం అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.ఆయన వెంట రూరల్ తహసీల్దార్ అప్పారావు, జిల్లా సహకార అధికారి వై.ఉమామహేశ్వరరావు ఉన్నారు.

గజలక్ష్మిగా పాత సోమాలమ్మ



రాజమహేంద్రవరంకల్చరల్ మార్చి21 : పాత సోమాలమ్మ జాతర మహోత్సవాలు అంగ రంగ వైభవంగా సాగుతున్నాయి.ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం అమ్మ వారు గజలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. మహిళా భక్తులు కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం శ్రీ మహాగురు స్థాన్ వారిచే సాయిబాబా భజన, అమ్మవారి పురవీధుల పల్లకీ సేవతో నిర్వహించారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి,గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త మాజీ కార్పొరేటర్ గొర్రెల సురేష్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. 24వ తేదీ వరకూ ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు.

ఫ్యాన్ కింద.. గుబులు



సీఎం జగన్ వద్దకు రాజమహేంద్రవరం పంచాయితీ

- నేరుగా కలిసిన అసంతృప్తులు
- వినిపించిన వేణుగాణం
- కనిపించిన రాజాకీయం
- సిటీలో బయటపడిన విభేదాలు
- ఎన్నికల వేళా కలవని నేతలు
- నేటికీ ఎడముఖం..పెడముఖం
- భరత్‌కు దూరం..దూరంగా

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వైసీపీలో గ్రూపులు రచ్చకెక్కాయి. రాజమహేంద్రవరం పంచాయితీ సీఎం జగన్ వద్దకు చేరింది. సిటీ పరిధిలో వైసీపీ పలు గ్రూపులుగా విడిపోయిన సంగతి తెలిసిందే.. చాలా కాలంగా విభేదాలున్నాయి. వైసీపీ సిటీ అభ్యర్థి ఎంపీ మార్గాని భరత్ రామ్‌తో పలువురు విభేదించి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న సంగతి తెలిసిందే. ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం సిటీ కోఆర్డినేటర్‌గా ఉన్న సమయంలో ఎంపీ మార్గాని భరత్‌తో ఆయనకు పొసగలేదు. అప్పట్లో ఒకరిపై ఒకరు అధిష్ఠానానికి ఫిర్యాదు చేసుకునే స్థితికి చేరింది. ఆ సమయంలో అధిష్ఠానం వద్ద భరత్ మాట నెగ్గడంతో సిటీ కోఆర్డినేటర్ బాధ్యతల నుంచి సుబ్రహ్మణ్యం తప్పుకున్నారు.తర్వాత మాజీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణను కోఆర్డినేటర్‌గా నియమిస్తే ఆయన వ్యక్తిగత కారణాల వల్ల కొద్ది రోజులు మాత్రమే ఉన్నారు. తర్వాత భరత్‌కు అధిష్ఠానం ఈ బాధ్యతలు అప్పగించింది. అనంతర పరిణామాల నేపథ్యంలో కొంత కాలం కిందట వైసీపీలో చేరిన ప్రస్తుత లోక్‌సభ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మరో పక్క రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు సిటీపై పట్టు ఉంది. దీంతో ఎంపీ భరత్ వర్సెస్ ఎమ్మెల్యే రాజాగా మారిన సంగతి తెలిసిందే.అప్పట్లో జగన్ వద్ద పంచాయతీ జరిగింది. ఇద్దరికీ గట్టిగా చెప్పడంతో కొంతకాలం మౌనంగా ఉన్నారు. తర్వాత ఎవరి కథ వారిదే. సిటీ యువజన కాంగ్రెస్‌నేతగా పీతా రామకృష్ణను నియమించినప్పుడు తనకు తెలియకుండా నియమించడమేంటని, ఎమ్మెల్యే రాజా సోదరుడు గోదావరి జిల్లాల, వైసీపీ యూత్ కోఆర్డినేటర్ జక్కంపూడి రాజా ఎంపీపై ఫైర్ అయ్యారు. తర్వాత మిథున్‌రెడ్డి సమక్షంలో పీతా రామకృష్ణ , గణేష్ మధ్య గొడవ జరగడంతో మిథున్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి కూడా తెలిసిందే. ఈ పరిస్థితుల్లో రామకృష్ణను గణేష్ బెదిరించిన ఆడియో కూడా బయటకు రావడంతో ఎంపీ, జక్కంపూడి వర్గాల మధ్య విభేదాలు ఏ స్థాయిలో ఉన్నాయో అందరికీ అర్థమైంది. ఈ పంచాయతీ అంతా ఇలా ఉంటే ఎంపీ భరత్ సిటీ ప్రెసి డెంట్‌గా ఉన్న నందెపు శ్రీనివాస్‌ను తప్పించి తనకు అనుకూలంగా ఉన్న అడపా శ్రీహరికి ఇప్పించిన సంగతి కూడా తెలిసిందే.అంతే కాకుండా రుడా చైర్‌పర్సన్ షర్మిళారెడ్డి వర్గంతోనూ ఆయనకు విభేదాలు ఉన్నట్టు సమాచారం.దీంతో ఎంపీకి శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా వర్గం, నందెపు శ్రీని వాస్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిళారెడ్డి వర్గాలు దూరంగా ఉంటున్నాయి. ఎన్నికలు వచ్చేసినా వీరి మధ్య సఖ్యత కుదరలేదు. సిటీ అభ్యర్థి భరత్ మాత్రం ఈ వర్గాలు ఎవరూ తనకు అవసరం లేదని,తాను చేసిన పనులే గెలిపిస్తాయనే స్థాయికి వెళ్లిపోయి.. ఈ వర్గాలను పూర్తిగా వదిలేసినట్టు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇటీవల సీఎం జగన్ భరత్‌కు వ్యతిరేకంగా ఉన్న వారిని తాడేపల్లి పిలిపించి మాట్లాడారు.దీనికి శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం, నందెపు శ్రీను, మంత్రి వేణు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఇటీవల వార్డు ఇన్‌చార్జిల నుంచి భరత్ తొలగించిన కొంత మంది నేతలు వెళ్లారు. మొదట శ్రీఘాకోళ్లపు, నందెపు వేర్వేరుగా జగన్‌ను కలిసి ఇక్కడ భరత్ ఒంటెద్దు పోకడల వల్లే సమస్య ఏర్పడిందని చెప్పినట్టు తెలిసింది. వైసీపీలో కష్టపడిన వారికి పదవులు ఇవ్వకుండా టీడీపీ నుంచి వచ్చిన వారికి పదవులు ఇచ్చారని, ఆధారాలతో కూడా చూపినట్టు సమా చారం.ఈ సమయంలో భరత్ మీద ఎన్ని చెప్పాలో అన్నీ చెప్పేసినట్టు తెలిసింది.అన్నీ విన్న తర్వాత ఎన్నికల సమయంలో ఐక్యం కాకపోతే దెబ్బతింటామని జగన్ హెచ్చరించినట్టు తెలిసింది. మిథున్ రెడ్డిని రాజమహేంద్రవరం పంపిస్తానని కూడా చెప్పినట్టు సమాచారం.ఈ నేతలంతా మూడు రోజుల కిందటే జగన్ కలిసినప్పటికీ.. స్థానికంగా నేత లలో ఏ మార్పు రాకపోవడం గమనార్హం. దీంతో వైసీపీలో గ్రూపిజం మరింత పెరిగినట్టు అయిం ది.ఈ పరిస్థితుల్లో వచ్చే ఎన్నికల్లో వైసీపీకి గడ్డుకాలమే.

ఎందుకో.. మార్పు!

రూరల్ గ్రామాలకు ప్రత్యేకాధికారుల మార్పు

హడావుడిగా ఉత్తర్వులు

నాయకుల విస్మయం

రాజమహేంద్రవరం రూరల్ మార్చి 21 : రాజమహేంద్రవరం రూరల్ మండలం పరిధిలో గ్రామ పత్యేకాధికారులను మారుస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. తొర్రేడు, కాతేరు గ్రామాలకు ఈవోపీఆర్‌డీ బాబూరావు, రాజవోలు, వెంకటనగరం, బొమ్మూరు గ్రామాలకు ఎంపీడీవో శ్రీనివాసరావును, పిడింగొయ్యి, కోలమూరు, హుకుంపేట, శాటిలైట్ సిటీ గ్రామాలకు జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబును ప్రత్యేకాధికారులుగా నియమించారు. ఇప్పటివరకు కోలమూరు, ధవళేశ్వరం గ్రామాలకు ప్రత్యేకాధికారిగా ఉన్న రాజమహేంద్రవరం ఆర్డీవో చైత్రవర్షిణిని ధవళేశ్వరం గ్రామానికే పరిమితం చేసి కోలమూరు పంచాయతీని డీపీవోకు అప్పగించారు. రాజానగరం మండలం దివాన్‌చెరువు పంచాయతీకి డీఎల్‌పీవో ప్రత్యేకాధికారిగా ఉండేవారు. దివాన్‌చెరువుతో పాటు వెలుగుబంద పంచాయతీలకు డీపీవో రాంబాబును గ్రామ ప్రత్యేకాధికారిగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అంత ఆఘమేఘాలపై ప్రత్యేకాధికారులను ఎవరి సిఫారసులపై, మార్చారో తెలియడంలేదని పలువురు మాజీ ప్రజాప్రతినిధుల విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ ఆదాయవనరులు ఉన్న గ్రామ పంచాయతీలకు డీపీవో, రూరల్ ఎంపీడీవోలను ప్రత్యేకాధికారులుగా నియమించారంటూ పలు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

చిన్నారికి దెబ్బ తగిలితే.. కాలం చెల్లిన ఆయింట్‌మెంట్ పూశారు..

పెద్దదైన దెబ్బ.. సీడీపీవోకు ఫిర్యాదు



అనపర్తి,మార్చి 21 : మందులు వాడే సమయంలో ఎక్స్‌పైరీ డేట్ చూడడం అనేది ప్రధాన విధి. నిర్లక్ష్యంగా ఏదో మందు ఉంది కదా అని వాడా మా ఇలా ఇబ్బందులు తప్పవు. అనపర్తి మండలం రామవరం ఎస్సీ పేటలోని అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారి పట్ల సిబ్బంది చూపిన నిర్లక్ష్య వైఖరి గురువారం వెలుగు చూసింది. అనపర్తి మండలం రామవరం ఎస్సీపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో దీపాశ్రీ చదువుకుంటుంది. ఈ నెల 18వ తేదీన సెంటర్‌లో ఉన్న గేటుపైకి ఎక్కి ఆడుకుంటూ గేటుపై నుంచి దీపాశ్రీ కిందకు పడిపోవ డంతో చేతికి గాయమైంది. అయితే సెంటర్‌లోని కార్యకర్త జె.లక్ష్మీకటాక్షం పాపను ఆసుపత్రికి తీసుకువెళ్లకుండా చేతికి కట్టుకట్టి కాలం చెల్లిన ఆయింట్‌మెంట్‌ను ఇచ్చి ఇంటికి పంపింది. మరుసటి రోజు తల్లిదండ్రులు కట్టువిప్పి కార్యకర్త ఇచ్చిన ఆయింట్‌మెంట్ పాప చేతికి పూశారు. అయితే పాపకు తగిలిన గాయం తగ్గకుండా పెద్దదైంది. కార్యకర్త ఇచ్చిన ఆయింట్ మెంట్‌ను పరిశీలించగా అప్పటికే అది కాలం చెల్లిందని గుర్తించిన తల్లిదండ్రులు అవాక్కయ్యారు. వెంటనే పాపను తీసుకుని ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లిన తల్లిదండ్రులు చిన్నారి చేతికి కుట్లు వేయించి చికిత్స చేయించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తపై తల్లిదండ్రులు రంగంపేట సీడీపీవో జెస్సీ ఫ్లోరెన్స్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మీకటాక్షంకు మెమో జారీ చేశారు.తక్షణమే వివరణ ఇవ్వాలని ఆమెను సీడీపీవో ఆదేశించారు.



విజిలెన్స్ ఎస్ఐ జగన్నాథరెడ్డి, హెచ్‌సీ జీవానందం, కానిస్టేబుల్ లోవరాజు

జిల్లా పోలీసులకు ఉగాది పురస్కారాలు

రాజమహేంద్రవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు భద్రతా విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందికి గౌరవం దక్కింది. ఉగాది పురస్కారాలను ప్రకటిస్తూ ఆంధ్రప్రదేశ్ రాజపత్రం గురువారం రాత్రి విడుదల చేశారు. డీసీఆర్బీలో పనిచేస్తున్న ఏఎస్ఐ బీవీఆర్ వర్మకు ఉత్తమ సేవా పథకం లభించింది.ట్రాఫిక్ విభాగంలో కానిస్టేబుల్ జే.శ్రీనివాసరావు, కొవ్వూరు పీఎస్‌లో పనిచేస్తున్న హెచ్‌సీ కె.శ్రీనివాసరావు, ఉండ్రాజవరం పీఎస్‌లోని హెచ్‌సీ వై.నాగేశ్వరరావు సేవా పతకానికి ఎంపికయ్యారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయంలో పనిచేస్తున్న ఎస్ఐ టి.జగన్నాథరెడ్డి, హెచ్‌సీ డి.జీవానందం, కానిస్టేబుల్ డి.వెంకట సత్య లోవరాజు సేవా పథకాలు అందుకోనున్నారు. ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టులో పనిచేస్తున్న ఎస్ఐ బి.సన్యాసయ్యకు సేవా పథకం లభించింది.ఎస్పీ జగదీశ్, విజిలెన్స్ ఎస్పీ సుబ్బారెడ్డి, ఎస్పీఎఫ్ కమాండెంట్ కేఎస్.రావు అభినందనలు తెలిపారు. ఫైర్ సర్వీసుకు సంబంధించి ఉమ్మడి జిల్లాలోని కోనసీమ, కాకినాడకు చెందిన సిబ్బంది ఎంపిక కాగా తూర్పునకు చోటు దక్కలేదు.



కరెంటు పంచాయితీ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వంలో ఏ వ్యవస్థకైనా అవస్థ తప్పదు మరి.. చివరికి విద్యుత్ పంపిణీ సంస్థదీ అదే పరిస్థితి. వైసీపీ ప్రభుత్వ తీరు కారణంగా నాలుగేళ్ల నుంచీ అవస్థలతో కొట్టుమిట్టాడుతోంది. సామాన్యుడు ఓ రూ.150ల బిల్లు చెల్లించకపోతే విద్యుత్ సిబ్బంది ఠంచనుగా వచ్చి ఫీజు లాక్కెళ్లిపోతారు. వినియోగదారుడు మళ్లీ ఏ అప్పోసొప్పో చేసి జరిమానాతో బిల్లు చెల్లించి కరెంటు ఆఫీసుకు వెళ్లి బతిమలాడుకుంటే ఏ సాయంత్రానికో దయతలచినపుడో వచ్చి సరఫరా పునరుద్ధరిస్తారు. ఈ అధికార దర్పమంతా సామాన్యుడి విషయంలోనే. పెద్దలు, ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయతీ విషయంలో పనిచేయదు. ఈ క్రమంలో కరెంటు పంపిణీ సంస్థకు, విద్యుత్ అధికారులకు ఇప్పుడు 'కరెంటు పంచాయతీ' తెగడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల బకాయిలు కరెంటు వైరుకు పట్టుకున్న కార్బన్ మాదిరిగా పేరుకుపోవడంతో బిల్లుల వసూళ్లకు విద్యుత్ అధికారులు, సిబ్బంది చెప్పులరిగేలా తిరుగుతున్నా ఫలితం కానరావడం లేదు.

- విద్యుత్ పంపిణీ సంస్థకు కొండలా బకాయిలు
- చెల్లించాల్సిన వీధిలైట్ల బకాయిలు రూ.283 కోట్లు
- విద్యుత్ బిల్లుల చెల్లింపులో ప్రభుత్వ కార్యాలయాల తీరూ అదే
- చెల్లించాల్సిన బిల్లులు సుమారు రూ.43 కోట్లు
- విద్యుత్ సిబ్బంది ప్రదక్షిణలు..అయినా ప్రయోజనం శూన్యం



నాలుగేళ్లుగా ఇదే పరిస్థితి..

పంచాయతీలు సాధారణంగా వీధి దీపాలకు, తాగునీటి సరఫరా చేయడానికి మోటార్లకు విద్యుత్ ఎక్కువగా విని యోగిస్తుంటాయి. దీని నిమిత్తం కరెంటు బిల్లు చెల్లించాల్సి ఉంటుంది. కానీ నాలుగేళ్లగా బిల్లుల చెల్లింపులు క్రమం త ప్పాయి. గతంలో పంచాయతీల్లో వీధి దీపాలు తదితర అవస రాలకు వినియోగించిన బిల్లుల నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వమే విద్యుత్ పంపిణీ సంస్థలకు సర్దుబాటు చేస్తూ ఉండేది. దీంతో ఇటు పంచాయతీలకు, అటు పంపిణీ సంస్థలకు ఇబ్బంది ఉండేది కాదు. అయితే గత నాలుగేళ్లగా పంచాయతీలనే నేరుగా కరెంటు బిల్లులు కట్టుకోవాలని చెప్పడంతో కష్టాలు ఎక్కువయ్యాయి. అసలే నిధులు, విధులు లేకుండా మూలుగుతున్న పంచాయతీల నెత్తిపై తాటిపండు పడినట్లయ్యింది. పంచాయతీల్లో సొమ్ములు లేక.. నిధులు రాక నాలుగేళ్లగా బిల్లులు చెల్లించలేకపోయారు. పంచాయతీలకు గ్రాంటు రూపంలో వచ్చే కేంద్ర ప్రభుత్వ నిధులు దారి మళ్లడం, సర్పంచ్‌ల అధికారంతో ఆటలు ఆడడంతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. పాలక మండళ్లు లేకుండా ప్రత్యేకాధికారుల పాల నలో ఉన్న పంచాయతీల్లో కూడా బకాయిలు పేరుకుపోయా యి. ఆర్డీవో, సబ్ కలెక్టరు స్థాయి అధికారులు ప్రత్యేక అధికా రులుగా వ్యవహరిస్తుండడంతో విద్యుత్ సిబ్బంది నోళ్లు మెదప లేని పరిస్థితి నెలకొంది. పంచాయతీ కార్యదర్శులకు విద్యుత్ అధికారులు ఫోన్లు చేస్తే ఏదోక సమాధానం చెప్పి కాలయా పన చేస్తున్నారని చెబుతున్నారు. విద్యుత్ సరఫరా నిలిపి వేస్తే ప్రజలు ఇబ్బంది పడతారనే కారణంతో విద్యుత్ సిబ్బంది బతిమలాడుకోవడం తప్ప ఏమీ చేయలేకపోతున్నారు.

జిల్లాలను విభజన చేసినప్పటికీ విద్యుత్ సర్కిల్‌ని విభ జించలేదు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని 1029 పంచాయతీలు ఈ సర్కిల్ పరిధిలోనే ఉన్నాయి. గత నెల 29 వరకూ అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన పంచాయతీల బకాయిలు రూ.9,14,48,198.. తూర్పుగోదావరి (విభజిత) రూ.149,38,34,662.. కాకినాడ జిల్లా 94,83,51,858.. కోనసీమ జిల్లా రూ.29,46,49,471.. వెరసి మొత్తం రూ.282,82,84,189 బిల్లులు చెల్లించాల్సి ఉంది. అందాక

పేరుకుపోయిన బకాయిలు ఇవే

గతేడాది ఏప్రిల్ నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి వరకూ అంటే 11 నెలల బిల్లులు వసూ లు చేసుకోవాలని ప్రభుత్వం చెప్పినా ఫలితం కానరావడం లేదు. ఉమ్మడి తూర్పులోని పంచాయతీల్లో కోలమూరు రూ.1.05 కోట్ల బకాయిలతో తొలి స్థానంలో ఉంది. తర్వాతి స్థానాల్లో వరుసగా ధవళేశ్వరం రూ.1.03 కోట్లు, దివాన్ చెరువు రూ.1 కోటి, ద్వారపూడి రూ.97.56 లక్షలు, హుకుంపేట రూ.92 లక్షలు, శాటిలైట్ సిటీ పంచాయతీలో రూ.86.27 కోట్ల విద్యుత్ బిల్లుల బకాయిలు పేరుకుపోయాయి.

ప్రభుత్వ కార్యాలయాల తీరిది..

పంచాయతీల మాదిరిగానే కొన్ని ప్రభుత్వ కార్యాలయాలూ విద్యుత్ బిల్లులు చెల్లించడం లేదు. వీటిలో గ్రామీణ నీటి సరఫరా, వైద్యం, రెవెన్యూ శాఖలు ముందు వరుసలో ఉన్నా యి. ప్రభుత్వ కార్యాలయాలకు నెలకు సుమారు రూ.40 కోట్ల విద్యుత్ బిల్లులు వస్తుంటే 10% కూడా వసూలుకాని పరిస్థితి ఉంది. గత నెల 29 నాటికి అల్లూరి సీతారామరాజు జిల్లాలోని ప్రభుత్వ కార్యాలయాల నుంచి రూ.15,87,93,696.. తూర్పు గోదావరి రూ.13,92,01,030.. కాకినాడ జిల్లా రూ.31,77,43,944.. కోనసీమ జిల్లా రూ.12,84,84, 656.. మొత్తం కలిపి ఉమ్మడి తూర్పుగోదావరిలోని ప్రభుత్వ కార్యాలయాల విద్యుత్ బిల్లుల బకాయిలు రూ.74,42,23,326 ఉన్నాయి. గతంలో బడ్జెట్ కేటాయింపుల ప్రకా రం నిధుల విడుదల ఉండడంతో విద్యుత్ బిల్లులు చెల్లించేసేవారు. కానీ, నాలుగేళ్ల నుంచీ అస్తవ్యస్తం కావడంతో సమస్య తలెత్తిందని చెబుతున్నారు.

గరుడ వాహనంపై ఊరేగింపు

ఘనంగా కొనసాగుతున్న నరసన్న కల్యాణోత్సవాలు





గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామివారు



పండిత సభ నిర్వహిస్తున్న దృశ్యం

కోరుకొండ, మార్చి 21: లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి వారు గరుడ వాహనంపై నాలుగు మాడ వీధుల్లో ఊరేగారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి, అమ్మవార్లకు పండ్లు, పుష్పాలు సమర్పించి మంగళహారతులిచ్చి ఆశీస్సులు అందుకున్నారు.

అలరించిన పండిత సభలు

లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా రంగరాజస్వామి వారి ఆలయ ప్రాంగణంలో విశిష్టాద్వైత పండిత సభలు జరిగాయి. ఉభయ వేదాంత పండితులు పరాసర లక్ష్మీనరసింహభట్టర్ స్వామి అధ్యక్షతన సభలో కందాడై శ్రీనివాసాచార్య, భద్రాచలం ఆస్థాన పండితుడు కందాడై మురళీకృష్ణ స్వామి వివిధ ఆధ్యాత్మిక అంశాలను వివరించారు. కార్యక్రమాల్లో రంగరాజ భట్టర్, పెదపాటి గిరిధరాచార్యులు, వాడపల్లి నాగు ఆచార్యులు, గోవర్ధన తిరుమలాచార్యులు, పెద్దింటి రంగాప్రసాద్, పెద్దింటి సత్తిబాబు, ఇరగవరపు కృష్ణామాచార్యులు, మార్గపురి రాంబాబు సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, కర్రి వీరగణేష్, ఇసుకపల్లి రాజారావు, కొత్తంగి బుచ్చిరామయ్య పాల్గొన్నారు.

అధికారుల తీరుపై భక్తుల ఆగ్రహం



ఏర్పాట్లపై ప్రశ్నిస్తున్న భక్తులు

కోరుకొండ, మార్చి 21: నరసన్న కల్యాణోత్సవాల్లో ఈ సంవత్సరం అన్నవరం దేవస్థానం అధికారులు అడుగడుగునా నిర్లక్ష్యం వహిస్తూ భక్తులను అవమానిస్తున్నారని గ్రామ సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ, మాజీ సర్పంచ్ నీరుకొండ బాబ్జి, పలువురు కల్యాణ దంపతులు నిరసన వ్యక్తం చేశారు. గత రాత్రి స్వామి వారి కల్యాణం సందర్భంగా ఒక్కో దంపతుల నుంచి రూ.1116 రుసుము తీసుకున్న అధికారులు కల్యాణం అనంతరం వారికి అందజేయాల్సిన స్వామి వారి ముత్యాల తలంబ్రాలు, లడ్డు ప్రసాదాలు అందించలేదని పేర్కొన్నారు. 225 మంది స్వామి వారి కల్యాణం టిక్కెట్లు తీసుకుని పీటలపై కూర్చున్నారు. వీరందరికీ వరుస క్రమంలో ముత్యాల తలంబ్రాలు, ప్రసాదాలు అందించాల్సి ఉండగా సిబ్బంది నిర్లక్ష్యంతో తోపులాట జరిగి కల్యాణ దంపతులకు తలంబ్రాలు, లడ్డూలు అందలేదని వారు ఆరోపించారు. అన్నవరం దేవస్థానానికి సుమారు 200 మంది సిబ్బంది కోరుకొండ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవ డ్యూటీలు నిర్వహిస్తున్నారు. అయితే వారు ఎవరూ బాధ్యత తీసుకోకపోవడంతో భక్తులకు అడుగడుగునా తీవ్ర అసౌకర్యం ఏర్పడింది. అదే విధంగా భక్తులకు ఉచిత దర్శనం గేటుకు తాళం వేసి ఉంచడం వల్ల భక్తులు అందరూ తప్పనిసరిగా టిక్కెట్ కొని దర్శనానికి వెళ్లాల్సిన ఇబ్బందికర పరిస్థితులను అన్నవరం దేవస్థానం అధికారులు కావాలనే కల్పిస్తున్నారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం



స్వామివారి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌అశోక్ దంపతులు



స్వామి,అమ్మవార్లు

యానాం, మార్చి 21: యానాంలో శ్రీవారి కల్యాణం గురువారం వైభవంగా జరిగింది. అర్చకులు స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఆశీనులు గావించారు. కల్యాణాన్ని అనువంశిక ఉత్సవదారులు చింతా వెంకటసుబ్బరావు కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్-లక్ష్మీస్నేహ దంపతులు కూడా పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు, సువర్ణ యజ్ఞోపవీతం, సువర్ణ మంగళ సూత్రం, ముత్యాల తలంబ్రాలు అందించారు. వేద పండితులు కల్యాణ క్రతువును అంగరంగ వైభవంగా జరిపించారు. తిలకించడానికి వచ్చిన ముత్తయిదువులందరికీ పసుపు, కుంకుమ పంపిణీ చేశారు. పలువురు ప్రముఖులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో అన్నప్రసాద వితరణను అతిథులు ప్రారంభించారు. గురువారం సాయంత్రం తోట వేణుగోపాల రావునాయుడు ఉత్సవదారులుగా ఉన్న హనుమంత వాహనంపై స్వామివారిని ఆశీనులు గావించి విశేష పూజలు చేశారు. అనంతరం పురవీధుల్లో స్వామివారు విహరించగా భక్తులు తిలకించి తరించారు.

డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో పలువురికి జైలు

సర్పవరం జంక్షన్ (కాకినాడ), మార్చి 21: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న నలుగురు వాహనదారులకు రెండేసి రోజుల జైలు శిక్ష, మరో 12 మందికి రూ. 10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ నాలుగో ఏజేఎఫ్‌సీఎం కోర్టు జడ్జి తీర్పునిచ్చినట్లు ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు కాకినాడ సిటీలో డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేపట్టగా 16 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు పోలీసులు గుర్తించారు. వారిని కాకినాడ నాలుగో ఏజేఎఫ్‌సీఎం కోర్టులో ప్రవేశపెట్టగా నలుగురు వాహనదారులకు రెండు రోజుల జైలు శిక్షను జడ్జి విధించారు. మరో 12 మందికి తలో రూ. 10 వేలు జరిమానా ఇలా మొత్తం రూ.1.20 లక్షలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్-2 సీఐలు చైతన్యకృష్ణ, రమేష్ తెలిపారు.

కార్పెంటర్ ఆత్మహత్య

అల్లవరం, మార్చి 21: యజమానిని మోసగించానన్న మనస్తాపంతో ఓ కార్పెంటర్ ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం బోడసకుర్రు పల్లిపాలేనికి చెందిన కార్పెంటర్ మల్లాడి లక్ష్మణరావు (50) అమలాపురంలోని మాధవి ఫర్నీచర్ షాపులో పనిచేస్తున్నాడు. అతను యజమాని పేరిట కొన్ని సామాన్లు తెచ్చి అమ్మాడు. దీనిపై యజమాని అమలాపురం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు కావడంతో యజమానిని మోసగించిన మనస్తాపంతో ఇంటి వద్ద చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. లక్ష్మణరావుకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు. అమలాపురం రూరల్ సీఐ పి.వీరబాబు పర్యవేక్షణలో అల్లవరం ఎస్ఐ జి.హరీష్‌కుమార్ ఆత్మహత్యగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంత నిర్లక్ష్యమా?



వంట గది నిర్వహణ

- పొంచివున్న ప్రమాదం
- ఒకే గదిలో ఎండీఎం, అంగన్వాడీ వంటకాలు
- పక్కనే పిల్లల తరగతులు
- ఫైర్ సిబ్బంది హెచ్చరించినా అదే తీరు

రాజమహేంద్రవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఓ పాఠశాల విద్యార్థుల భద్రతా విషయంలో నిర్లిప్తంగా ఉండడంపై తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. గతంలో అంగన్వాడీ కేంద్రాలు వేరుగా ఉండేవి. వైసీపీ ప్రభుత్వం వచ్చాక వాటిని తీసుకొచ్చి ప్రాథమిక పాఠశాలల్లో కలిపారు. దీంతో అటు చిన్నారులకు బోధన చేసే విషయంలో, ఇటు వంట చేసే విషయంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. లాలాచెరువు సమీపంలోని ఓ ప్రాథమిక పాఠశాలలోకి అంగన్వాడీని తరలించారు. అయితే అప్పటికే మధ్యాహ్న భోజనానికి వినియోగిస్తున్న చిన్న వంటగదిలోనే అంగన్వాడీ పిల్లలకు వంట చేయడానికి సర్దుకోవాలని చెప్పారు. దీంతో ఇలా ఫొటోలో కనిపిస్తున్న విధంగా రెండు సిలిండర్లను, రెండు పొయ్యిలను పక్కపక్కన పెట్టి రోజూ వంట చేస్తున్నారు. ఆ గదికి ఆనుకొనే పిల్లల తరగతి గదులు ఉన్నాయి. అగ్నిమాపక శాఖ సిబ్బంది వారోత్సవాల సందర్భంగా అగ్ని ప్రమాద నివారణపై ఈ పాఠశాలలో మాక్ డ్రిల్ నిర్వహించారు. అప్పుడు రెండు సిలిండర్లు, పొయ్యిలు ఒకేచోట పెట్టి వంట చేస్తుండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మార్పు చేసుకోవాలని సూచించారు. కానీ, ప్రధానోపాధ్యాయుల తీరులో నేటికీ మార్పు రాలేదు. దీంతో ఏ చిన్న ప్రమాదం జరిగినా పెద్ద నష్టానికి దారి తీసే అవకాశం ఉందంటూ తల్లిదండ్రులు భయపడుతున్నారు. అంగన్వాడీ వర్కర్‌లకు వంట కోసం వేరే గది ఇచ్చే అవకాశం ఉన్నా.. ఆ గదిని వ్యర్థాలకు ఉపయోగిస్తుండడం బాధ్యతా రాహిత్యానికి రుజువని చూపుతున్నారు.

ప్రతి జీవికి అడవితో అనుబంధం

రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ కృష్ణప్రియ



సమావేశంలో మాట్లాడుతున్న డైరెక్టర్ కృష్ణప్రియ

దివాన్‌చెరువు, మార్చి 21: ప్రపంచంలో ప్రతి జీవికి అడవులతో సంబంధాలు ఉంటాయని ఏపీ రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ జి.కృష్ణప్రియ అన్నారు. దివాన్ చెరువులోని రాష్ట్ర అటవీ అకాడమీలో ప్రపంచ అటవీ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ ఏడాది అడవులు ఆవిష్కరణ-మెరుగైన ప్రపంచం కోసం కొత్త పరిష్కారాలు అనే థీమ్‌తో అటవీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు కృష్ణప్రియ వివరించారు. మనం తాగేనీరు, ఆహారం, మందులు, ఆశ్రయం, ఆక్సిజన్ కోసం అడవులతో సంబంధం కలిగి ఉంటుందని అటువంటి అడవులను కాపాడేందుకు అటవీశాఖ కృషి చేస్తోందన్నారు. అలాగే ప్రతిఒక్కరూ అడవులను పరిరక్షించుకునేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తూ రాబోయే తరాలకు మంచి వాతావరణంలో జీవించే అవకాశాలను కల్పించాలని కోరారు. శిక్షణలో ఉన్న అటవీ బీట్ అధికారులు మాట్లాడుతూ ముఖ్యంగా మన రాష్ట్రంలో ఎర్రచందనం, పెద్దపులి, కలివి కోడి వంటి వాటిని ప్రతిఒక్కరూ పరిరక్షించుకోవాలన్నారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వృక్షశాస్త్రం హెచ్‌వోడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ వృక్షశాస్త్రం, అటవీ విజ్ఞానాన్ని పెంపొందించడంలో తమ కళాశాల బోటనీ విద్యార్థులు కృషి చేస్తున్నారని, బోటనీ విభాగం అటవీశాఖతో సమన్వయం చేసుకుని విద్యార్థులకు అటవీ ప్రాంతంలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. చివరిగా కళాశాల విద్యార్థులు, అధికారులు కలిసి అటవీ సంరక్షణకు తమ వంతు పాత్రను మనస్ఫూర్తిగా నిర్వహిస్తామని, పర్యావరణానికి ప్రతికూలమైన ఏ చర్యను చేపట్టబోమని ప్రతిజ్ఞ చేశారు.

శీతల పానీయాల గోదాములో అగ్నిప్రమాదం



కరప, మార్చి 21: కరపలోని ఒక శీతల పానీయాల గోదాములో గురువారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంభవించి రూ.2 లక్షల ఆస్తి నష్టం జరిగింది. స్థానిక పీఏసీఎస్ గోదాములో గ్రామానికి చెందిన కొర్ల చక్రయ్య శీతల పానియాల స్టాకు పెట్టుకుని హోల్ సేల్, రిటైల్ వ్యాపారం చేస్తున్నాడు. బుధవారం రాత్రి గోదాముకు తాళం వేసుకుని ఇంటికి వెళ్లిపోయాడు. గురువారం తెల్లవారుజామున గోదాము షెట్టర్ల నుంచి పొగలు వస్తుండడం గమనించి తెరిచి చూశాడు. అప్పటికే మంటలు చెలరేగి రూ.85 వేల నగదు, ల్యాప్‌టాప్, కౌంటింగ్ మిషన్, సీసీ కెమెరాల ఎక్విప్‌మెంట్, శీతల పానియాల కేసులు, ప్రింటర్, తదితర వస్తువులు కాలి బూడిదయ్యాయి. కాకినాడ జగన్నాయక్‌పూర్ ఫైర్ స్టేషన్ నుంచి ఫైరింజన్ వచ్చి మంటలను అదుపుచేసింది. వీఆర్వో ప్రభుదాస్ ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం సంభవించి ఉంటుందని భావిస్తున్నారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మిసత్తిబాబు ఘటనా స్థలానికి వెళ్లి ప్రమాద వివరాలను అడిగి తెలుసుకున్నారు.




తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

పిఠాపురం, మార్చి 21: పిఠాపురం పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో ఉన్న సివిల్‌సప్లైస్ గొల్లప్రోలు ఎంఎల్ఎస్ పాయింట్‌ను విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా సరుకుల నిల్వల్లో భారీ తేడాలు ఉన్నట్లు గుర్తించారు. గొల్లప్రోలుకు చెందిన మండల లెవెల్ స్టాక్ పాయింట్‌లో విజిలెన్స్, పౌర సరఫరాల శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు జరిపారు. సరుకుల నిల్వలను పరిశీలించారు. ఇందులో పలు లోపాలు బయటపడ్డాయి. ఐసీడీఎస్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయాల్సిన కందిపప్పు రికార్డుల్లో కంటే 3.99 క్వింటాళ్లు అధికంగా ఉన్నట్లు, రేషన్‌కార్డుదారులకు అందించాల్సిన కందిపపప్పు 7.13 క్వింటాళ్లు తక్కువగా ఉన్నట్లు గుర్తించారు. పామాయిల్ లీటరు ప్యాకెట్లు 112 అదనంగా ఉండగా, అరలీటరు ప్యాకెట్లు 245 తక్కువగా ఉన్నాయి. గోధుమపిండి 3.87 క్వింటాళ్లు, పంచదార 1.74 క్వింటాళ్లు, ఫోర్టిఫైడ్ బియ్యం 5 క్వింటాళ్లు తక్కువగా ఉన్నట్లు తనిఖీల్లో వెల్లడయింది. సరుకుల నిల్వల్లో భారీగా వ్యత్యాసాలు వెలుగుచూడటంతో పాటు స్టాకు బోర్డుపై నిల్వల వివరాలు రాయకపోవడం, ఫైర్ సేఫ్టీ పరికరాలు లేకపోవడాన్ని గుర్తించారు. సరుకుల నిల్వల్లో భారీగా వ్యత్యాసాలు ఉన్న నేపథ్యంలో బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని సివిల్‌సప్లైస్ డీఎంకు సిఫారసు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ డీఎస్పీ ముత్యాలనాయుడు, సీఐ శ్రీనివాసరెడ్డి, తహసీల్దారు విజయకుమార్, జీవానందం వలీ, సీఎస్ డీటీ మర్రి వీరాస్వామి పాల్గొన్నారు.


నేటి నుంచి నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలు





విద్యుత్ దీపాలంకరణ

దేవరపల్లి, మార్చి 21: దేవరపల్లి మండలం గౌరీపట్నం నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలు ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ ఉత్సవాల్లో అన్ని మతాలకు అతీతంగా భక్తులు పాల్గొనడం విశేషం. హిందువులు కూడా ఈ ఉత్సవాల్లో పాల్గొని మొక్కుబడులు తీర్చుకుంటారు. తలనీలాలు సమర్పించడం, ముడుపులు సమర్పించడం చేస్తుంటారు. ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్ పీటర్ తెలిపారు.



ఏజెన్సీ సమాచారం

నష్ట పరిహారం మాటేంటి సారు...?

జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా సర్వం కోల్పోయి నిరాశ్రయులైన ప్రజలు...

నష్టపరిహారం అందించడంలో విఫలమైన రెవెన్యూ యంత్రాంగం...

రోజురోజుకు ఎక్కువవుతున్న బాధితుల ఆవేదన


జాతీయ రహదారి నిర్మాణ పనులు


కూలిన బిల్డింగ్ (ఫైల్‌ఫొటో)

రాజవొమ్మంగి, మార్చి 21: జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా భూములు, ఇళ్లు, దుకాణాలు నష్టపోయినవారికి రెండేళ్లయినా ఇప్పటికీ పరిహారం దక్కకపోవడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో నష్ట పరిహారం అందించడంలో యంత్రాంగం విఫలమైంది. 2022లో రాజమహేంద్రవరం నుంచి విజయనగరం వరకు జాతీయ రహదారి 516-ఈ నిర్మాణం చేపట్టారు. రంపచోడవరం డివిజన్ పరిధిలో రోడ్డు వెంబడి ఉన్న ఇళ్లను, షాపులను కూల్చి వేశారు. అలానే పోడు భూములను స్వాధీనం చేసుకుని రోడ్డు నిర్మాణం దాదాపుగా పూర్తి చేశారు. అయితే భూమి, ఇళ్లు, షాపుల యజమానులకు మాత్రం నష్టపరిహారం ఇంకా అందలేదు. దీనిపై ప్రజాప్రతినిధులు, ప్రజలు ఎన్నిసార్లు జిల్లా కలెక్టర్, సబ్ కలెక్టర్‌లకు వినతిపత్రాలు ఇచ్చినా ప్రయోజనం లేదు. పది రోజుల్లో మీ బ్యాంకు ఖాతాల్లో డబ్బులు పడతాయని చెప్పడం తప్ప పడిన పాపాన పోలేదు. విసిగి వేసారిపోయిన బాధితులు గత నెలలో జడ్డంగి రోడ్డుపై బైఠాయించారు. నష్టపరిహారం చెల్లించాలంటూ ధర్నా నిర్వహించారు. జాతీయ రహదారి నిర్మాణ పనులకు వినియోగించే వాహనాలను ఆపివేయడంతో రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి డిప్యూటీ తహశీల్దార్ శ్రీధర్ వచ్చి 20 రోజులలో డబ్బులు వేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు. అయితే ఈ సంఘటన జరిగి సుమారు నెల రోజులు అవుతున్నా నేటికీ నష్టపరిహారం సొమ్ములు పడలేదు. అయితే పక్క నియోజకవర్గంలో నష్టపరిహారం చెల్లించిన తర్వాతే గృహాలను తొలగించారని, అయితే ఇక్కడ మాత్రం ప్రజలను మభ్యపెట్టి ముందుగానే ఇళ్లు తొలగించి, భూములు స్వాధీన పరుచుకున్నారని బాధితులు వాపోతున్నారు. రంపచోడవరం నియోజకవర్గంలో రాజవొమ్మంగి, అడ్డతీగల, గంగవరం, రంపచోడవరం మండలాల్లోని 32 గ్రామాల పరిధిలో బాధితులు ఉన్నారు. భూముల యజమానులకు సంబంధించి 70 శాతం మందికి నష్టపరిహారం చెల్లించారు. మిగిలిన వారికి ఇవ్వాల్సి ఉంది. ఇళ్లు, దుకాణాలకు సంబంధించి పరిహారం ఇంకా అందలేదు. రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయ అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి అంటూ బాధితులు ఆవేదన చెందుతున్నారు. అయితే త్వరలో సొమ్ములు జమ అవుతాయని రంపచోడవరం సబ్ కలెక్టర్ కార్యాలయ డీటీ శ్రీధర్ ఆంధ్రజ్యోతికి ఫోన్‌లో తెలిపారు.

మావోయిస్టు ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాల పరిశీలన


మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న ఎస్పీ

చింతూరు, మార్చి 21 : మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలలో పోలింగ్ కేంద్రాలను అల్లూరి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా గురువారం పరిశీలించారు. చింతూరు మండలంలోని తుమ్మల, సింగన్నగూడెం, బొడ్డుగూడెం గ్రామాలతో పాటు ఛత్తీస్‌గఢ్ సరిహద్దున ఉన్న అల్లిగూడెం, పేగ గ్రామాలలో పోలింగు కేంద్రాల స్థితిగతులను ఆయన పరిశీలించారు. ఓఎస్‌డీ కేవీ మహేశ్వరరెడ్డి, ఏఎస్పీ రాహుల్ మీనా, సర్కిల్ పోలీసులు ఆయన వెంట ఉన్నారు.

ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

మోతుగూడెం, మార్చి 21: వై.రామవరం మండలం బొడ్డగంగి పంచాయతీ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా జరుగుతున్న క్రికెట్ టోర్నమెంట్ ముగిసింది. 10 జట్లు తలపడగా ప్రతి జట్టుకు క్రికెట్ కిట్ అందజేశారు. ఈ టోర్నమెంట్‌లో డొంకరాయి జట్టు విజేతగా నిలిచింది. సెకండ్ కమాండెంట్ సీహెచ్ సురేష్‌బాబు ట్రోఫీ అందజేశారు. యువత క్రీడల వైపు దృష్టి సారించాలని ఆటలు ఆరోగ్యానికి ఎంతో మంచిదని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్/42 బెటాలియన్ ఇన్‌స్పెక్టర్ జీడీ శశికుమార్, సివిల్ ఎస్‌ఐ శివకుమార్ పాల్గొన్నారు.

'వంతలకే టికెట్ కేటాయించాలి'

చింతూరు, మార్చి 21: వంతల రాజేశ్వరికే రంపచోడవరం టీడీపీ టికెట్ కేటాయించాలని టీడీపీకి చెందిన మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వీరాపురంలో గురువారం నేతలు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ మాజీ అధ్యక్షుడు ఎండీ జహంగీర్ మాట్లాడారు. వంతల రాజేశ్వరి వరదల సమయంలో ముంపు గ్రామాల ప్రజలకు ఎంతో సేవ చేశారన్నారు. నిత్యం కార్యకర్తకు అండగా ఉంటూ వారి సమస్యలను పరిష్కరించే దిశగా అధికార పార్టీతో పోరాడన్నారు. వంతల రాజేశ్వరికి టికెట్ కేటాయించే వరకు పోరాటం కొనసాగుతుందన్నారు. బొక్కిలి మల్లయ్య కరణం లక్ష్మయ్య బొక్కిలి ప్రసాద్, సీనియర్ నాయకులు బొక్కిలి రాంబాబు, ఎండీ రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

'హామీలిచ్చి మోసం చేసిన జగన్'

చింతూరు, మార్చి 21: జగన్మోహన్‌రెడ్డి అనేక హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని మండల సీపీఎం కార్యదర్శి సీసం సురేష్ అన్నారు. ఏజీ కోడేరులో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వాసితుల పట్ల కపట ప్రేమ నటిస్తున్నాయన్నారు. కార్యక్రమంలో నాయకులు కారం నాగేష్, ధర్మాల మల్లయ్య, ధర్మాల వీరభద్రం, కూర సుబ్బారావు, ధర్మాల పొదయ్య తదితరులు పాల్గొన్నారు.

విత్‌డ్రాల విషయంలో మోసం చేస్తే చర్యలు

వరరామచంద్రాపురం, మార్చి 21: మినీ ఏటీఎం విత్‌డ్రాల విషయంలో అమాయక గిరిజనులను మోసం చేస్తే మినీ ఏటీఎం ప్రైవేటు నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని వీఆర్‌పురం తహశీల్దార్ సయ్యద్ మౌలానాఫాజిల్ నిర్వాహకులకు తెలిపారు. గురువారం రేఖపల్లిలోని తహశీల్దార్ కార్యాలయంలో మినీ ఏటీఎం నిర్వాహకులతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. అమాయక గిరిజనులు క్రెడిట్ కార్డుతో డబ్బులు విత్‌డ్రా కోసం మినీ ఏటీఎం దగ్గరకు వచ్చినప్పుడు ఏటీఎం నిర్వాహకులు వారిని మభ్యపెట్టి ఎక్కువ డబ్బులు విత్‌డ్రా చేస్తే అట్టి నిర్వాహకులపై కేసులు పెడతామన్నారు. ఆర్‌ఐ మడకం రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ



ఎటపాక, మార్చి 21: ఎటపాక తహసీల్దార్‌గా డి.శేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఆయన ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటి వరకు అదనపు బాధ్యతలతో పృథ్వీ తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. వైజాగ్‌లో పనిచేస్తున్న శేఖర్‌ను ఇక్కడకు బదిలీ చేశారు. అయితే పృథ్వీని చింతూరు ఐటీడీఏ విభాగానికి బదిలీ చేసినట్లు తెలిసింది.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

దివాన్‌చెరువు, మార్చి 21: రోడ్డు భద్రతా నియమాలను ప్రతిఒక్కరూ విధిగా పాటించాలని గైట్ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కోరారు. గైట్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో దివాన్ చెరువులో గురువారం రహదారి భద్రతా కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, సీటుబెల్ట్ ధరించాలని సూచించారు.

వైసీపీ పాలనపై ప్రజల్లో వ్యతిరేకత

టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రామకృష్ణారెడ్డి


అనపర్తి: కొప్పవరంలో ప్రచారం నిర్వహిస్తున్న రామకృష్ణారెడ్డి

అనపర్తి, మార్చి 21: వైసీపీ పాలనపై ప్రజలు ఎంత వ్యతిరేకంగా ఉన్నారో ఇంటింట ప్రచారంలో తమకు దక్కుతున్న ఆదరణే సాక్ష్యమని ఎన్డీఏ ఎమ్మెల్యే అభ్యర్థి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండలం రామవరంలో ఆయన ఇంటింట ప్రచారం నిర్వహించారు. ఎన్డీయే కూటమి అధికారం చేపట్టిన తర్వాత జరిగే లబ్ధిని వివరిస్తూ ఆయన ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ గ్రామాల్లో రీసర్వే పేరుతో జగన్‌రెడ్డి చేపట్టిన కార్యక్రమంలో అనేక మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని వైసీపీ తిరిగి అధికారం చేపడితే పంట భూములకు రక్షణ ఉండదన్నారు. గత ఐదేళ్లలో ఒక్క పంటకు కూడా సరైన ధర లభించక ఎరువులు, పురుగుల మందుల ధరలు పెరిగి రైతు జీవనం దుర్భరంగా మారిందన్నారు. కనీసం పంటకు పూర్తి స్థాయిలో సాగునీరందించే పరిస్థితి కూడా వైసీపీ ప్రభుత్వంలో లేదన్నారు. కార్యక్రమంలో సిరసపల్లి నాగేశ్వరరావు, కర్రి వెంకటరామారెడ్డి, సత్తి దేవదానరెడ్డి, వైజాగ్ శ్రీను, పోతంశెట్టి సుభాషిణి వెంకటరామారెడ్డి దంపతులు, కర్రి శేషారత్నం, అశోక్‌రెడ్డి, సిరసపల్లి లక్ష్మి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా కొప్పవరంలో అతిపెద్ద కుటుంబాలైన కర్రి వారు రామకృష్ణారెడ్డికి మద్దతు ప్రకటించారు. ప్రచారానికి వచ్చిన ఆయనకు కర్రి కుటుంబంలోని పెద్దలు పూలమాలలతో స్వాగతం పలికి మద్దతు ప్రకటించారు.

జగన్ పాలన ముగిసినట్టే: వాసు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 21: రాష్ట్రంలో ప్రజలను మోసం చేసి ఐదేళ్ల పాటు అనేక అగచాట్లకు గురిచేసిన సీఎం జగన్ పాలన ఇక ముగిసినట్టేనని రాజమహేంద్రవరం టీడీపీ-జనసేన-బీజేపీ ఉమ్మడి అభ్యర్థి ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 40వ డివిజన్‌లో జనసేన సిటీ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, మజ్జి రాంబాబులతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. కూటమి మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందించారు. వాసు, అనుశ్రీ మాట్లాడుతూ ఎన్నికల్లో గెలిచిన తర్వాత అన్ని వర్గాల ప్రజలను సీఎం జగన్ మోసం చేశాడన్నారు. ఇప్పుడు ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో సిద్ధం అంటూ రావడానికి సిగ్గు లేదా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన పార్టీల నాయకులు, కార్యకర్తలు, మాజీ కార్పొరేటర్లు వివిధ కమిటీల సభ్యులు పాల్గొన్నారు.


రాజమహేంద్రవరం భవిష్యత్తుకు గ్యారెంటీలో ఆదిరెడ్డి వాసు, అనుశ్రీ

1481.6 లీటర్ల సారా ధ్వంసం


వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం బాటిల్స్, పాత్రలు

రంగంపేట, మార్చి, 21: రంగంపేట ఎస్ఈబీ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన మద్యం బాటిల్స్ సారాను ధ్వంసం చేసినట్టు సీఐ ఎస్.రాంబాబు తెలిపారు. గురువారం రాజమండ్రి అసిస్టెంట్ ఎన్ఫోర్స్మెంట్ సూపరింటెండెంట్ కె.జయమౌనిక ఆధ్వర్యంలో 48 కేసుల్లో 1481.6 లీటర్ల సారాను, 72 కేసుల్లో పట్టుబడిన 347 బాటిల్స్‌లోని 65.31 లీటర్ల మద్యం, 547 బీరు బాటిల్స్‌లో 355.55 లీటర్ల మద్యాన్ని ధ్వంసం చేశామన్నారు. అలాగే సారా తయారికి ఉపయోగించే 27 అల్యూమినియం పాత్రలను, ఒక గ్యాస్‌బండ, ఒక గ్యాస్‌స్టౌవ్‌ను వేలం వేయగా వచ్చిన రూ.10640ను ప్రభుత్వ ఖాతాకు జమచేసినట్లు ఎస్ఈబీ సీఐ తెలిపారు.

ఎస్ఈబీ దాడుల్లో ఇద్దరి అరెస్టు

మండలంలోని ముకుందవరంలో సారా తయారు చేస్తున్న కేతా రాంబాబును అరెస్టు చేసి 35 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని, 600 లీటర్ల బెల్లపుఊట ధ్వంసం చేశామన్నారు. అలాగే ఈలకొలనులో మద్యం సీసాలు అమ్ముతున్న అంచూరి సుబ్బాయమ్మను అరెస్టు చేసి, ఆమె నుంచి 4మద్యం సీసాలు, 10 బీరు సీసాలు స్వాధీనం చేసుకున్నామని సీఐ రాంబాబు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ జి.అనిల్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రంగంపేట, మార్చి 21: రాజానగరం 132 కేవీలో మరమ్మతుల కారణంగా శుక్రవారం మండలంలోని రంగంపేట, వడిశలేరు, ఈలకొలను, జి.దొంతమూరు విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని గ్రామాలకు, వ్యవసాయ బోరులకు మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు సరఫరా పూర్తిగా నిలిపివేయనున్నట్టు ట్రాన్స్‌కో ఏఈ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

జాంపేట చేపల మార్కెట్‌లో మాకు హక్కుంది

మత్స్యకార మహిళలు


సమావేశంలో మాట్లాడుతున్న మత్స్యకార మహిళ నాగమణి

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 21: రాజమహేంద్రవరం జాంపేట మార్కెట్‌లో వ్యాపారం చేసే హక్కు తమకు ఉందని, అక్కడున్న వ్యాపారుల దయాదాక్షిణ్యాలపై లేదని మత్స్యకార మహిళ నాగమణి అన్నారు. గౌతమీ జీవకారుణ్య సంఘం ఎదురుగా ఉన్న గోదావరి రేవులో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జాంపేట చేపల మార్కెట్‌లో వ్యాపారం చేసుకునే హక్కును గోదావరి బెస్తా మహిళా సహకార సంఘం, గోదావరి బెస్తా శాండ్ అండ్ క్వారీ బోట్స్‌మెన్ ఫిషర్‌మెన్ కోపరేటివ్ సొసైటీ, గోదావరి మాత శాండ్ అండ్ క్వారీ మత్స్యకార సహకార సంఘం సభ్యులందరికీ కల్పిస్తూ గతంలో అధికారులు తమకు ఉత్తర్వులను ఇచ్చారని చెప్పారు. అయితే దళారులుగా ఉన్న కోటేశ్వరరావు, రమేష్‌లు కావాలనే తమ సంఘం గౌరవాధ్యక్షుడు వెలమ లక్ష్మణరావుపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. వెలమ లక్ష్మి మాట్లాడుతూ తాము వ్యాపారులం కాదని అంటున్న వారిపై పరువునష్టం దావా వేస్తామన్నారు. లాటరీ ద్వారా కేటాయింపులు జరిగాయి ఆ ప్రకారమే వ్యాపారాలు చేసుకుంటామన్నారు. సమావేశంలో సంఘాల అధ్యక్షులు కంచి ప్రభాకరరావు, మరిడియ్య, సామల సత్యనారాయణ, మోర్ సంతోష్, మధురబోయిన నాగమణి, గొల్ల అచ్చియ్యమ్మ, గొల్ల శాంతి, వల్లె పైడితల్లి, వద్దె ధనలక్ష్మి పాల్గొన్నారు.

వ్యాపారులను భయపెట్టడం అవివేకం

వారికి అండగా మేమున్నాం
మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి


దేవిచౌక్-జాంపేట రోడ్డులో వ్యాపారులతో మాట్లాడుతున్న ఆదిరెడ్డి అప్పారావు

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 21: తనకు సహకరించడం లేదని వ్యాపారస్తులను అదిరించి బెదిరించి మెట్లు కూల్చి వేసి తన గుప్పెట్లో పెట్టుకోవాలని వైసీపీ రాజమహేంద్రవరం సిటీ అభ్యర్థి, ఎంపీ భరత్‌రామ్ ఆలోచన చేయడం అవివేకమని మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు అన్నారు. దేవిచౌక్-అల్లూరి విగ్రహం-జాంపేట వరకు ఉన్న వ్యాపార దుకాణాల సముదాయాలు, డ్రైనేజీలకు ఆనుకుని ఉన్న మెట్లను, నాపరాళ్లను కూల్చివేసిన వాటిని గురువారం పరిశీలించి బాధిత వ్యాపారులతో మాట్లాడారు. జాంపేట-దేవిచౌక్ రోడ్డుకి ఇరువైపులా వ్యాపారస్తులు వైసీపీకి అనుకూలంగా లేరని కక్షసాధింపు చర్యలకు దిగడంసరైన విధానం కాదన్నారు. వ్యాపారస్తులు డ్రైనేజీలకు ఆనుకుని ఉన్న మెట్ల అరుగులను ఎత్తుపెంచుకుని నాపరాళ్ళు వేసుకోవడానికి సుముఖంగా ఉన్నారని అందువల్ల మురుగునీటి పారుదలకు ఎటువంటి ఇబ్బంది కలగదన్నారు. తాను కమిషనర్ దినేష్‌కుమార్‌తో మాట్లాడానని ఇక్కడ సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఆయన వెంట టీడీపీ బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ కుడుపూడి సత్తిబాబు, రెడ్డి మణేశ్వరరావు, మాలే విజయలక్ష్మి, మీసాల నాగమణి, ద్వారా పార్వతిసుందరీ, రఫిక్ రాజా పాల్గొన్నారు.

ఎర్ర జెండా దిమ్మలను తొలగించొద్దు!

సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 21 : వచ్చే ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని జిల్లా కార్యదర్శి తాటిపాక మధు కోరారు. కార్మికులకు చిహ్నంగా ఉండే సుత్తి, కొడవలి గుర్తు కల్గిన మేడే స్థూపాలను అధికారులు తొలగించేందుకు ప్రయత్నించడం అన్యాయమన్నారు. రాజమహేంద్రవరం సీపీఐ కార్యాలయంలో గురువారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఎన్ని చెప్పినా వలంటీర్లు వైసీపీ కార్యకర్తల్లా పనిచేస్తున్నారన్నారు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ఎన్నడూ లేని విధంగా ఆయా వార్డుల్లో ఎర్రజెండా దిమ్మలను తొలగించాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సుత్తి, కొడవలి అనేది ప్రపంచ కార్మికులారా ఏకం కండి అని తెలియజేసేది తప్ప అది ఎన్నికల గుర్తు కాదన్నారు. సీపీఐ బృందం నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌ను కలిసి వైసీపీ కార్యకర్తల్లా పనిచేస్తున్న వలంటీర్ల లిస్టును, ఏయే వార్డుల్లో సుత్తి, కొడవలి దిమ్మలను కూల్చివేస్తున్నారో వాటి వివరాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కూండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌కేఆర్ కళాశాలను పరిశీలించిన న్యాక్

రాజమహేంద్రవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలను న్యాక్ బృందం పరిశీలించినట్టు ప్రిన్సిపాల్ పి.రాఘవ కుమారి తెలిపారు. న్యాక్ పర్యవేక్షణ బృందం చైర్‌పర్సన్, ప్రొఫెసర్ పి.నారాయణ స్వామి పాపన్న, కో-ఆర్డినేటర్ గీతారాణి తదితరులకు ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ కేడెట్లు ఘన స్వాగతం పలికారన్నారు. కళాశాలలోని అన్ని విభాగా లను, మౌలిక వసతులను క్షుణ్ణంగా న్యాక్ బృందం పరిశీలించింద న్నారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కోఆర్డినేటర్ బి.అనురాధ సూర్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషన్‌లో డీఎస్పీ తనిఖీలు


తనిఖీలు చేస్తున్న డీఎస్పీ మోహనరావు

రాజమహేంద్రవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సం దర్భంగా రైల్వే స్టేషన్, రైళ్లలో రాజమహేంద్రవరం ప్రభుత్వ రైల్వే పోలీసు డీఎస్పీ ఎల్.మోహనరావు తమ సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు.అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నించారు. ప్రయా ణికుల లగేజీలను పరిశీలించారు. అక్రమ మద్యం రవాణా నిర్మూలనలో భాగంగా సోదాలు చేశామని డీఎస్పీ తెలిపారు. తనిఖీల్లో ఎస్ఐ కె.మావుళ్ళ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి షిర్డిసాయి మందిర వార్షికోత్సవం

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 21: రాజమహేంద్రవరం మెయిన్ రోడ్డులో శ్రీ షిర్డిసాయి మందిరంలో 12వ వార్షిక కుంభాభిషేక మహోత్సవాలు మార్చి 24నుంచి 28వరకు జరుగుతాయని నిర్వాహకుడు అద్దంకి వేంకట ప్రభాకర శ్రీరామచంద్రరావు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 6గంటల నుంచి రాత్రి వరకు సాయి సేవలో వివిధ కార్యక్రమాలు జరుగుతాయని చెప్పారు.

నారా దేవాన్ష్ పుట్టినరోజు వేడుక

రాజమహేంద్రవరం సిటీ, మార్చి 21: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ కుమారుడు నారా దేవాన్ష్ పుట్టినరోజును గురువారం ఘనంగా చేశారు. స్థానిక ప్రియదర్శిని బధిరుల పాఠశాలలో టీడీపీ నేత నిమ్మలపూడి గోవింద్ ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేశారు. అనంతరం మధ్యాహ్నం భోజనం వడ్డించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కంటిపూడి శ్రీను, మళ్ళ వెంకట్రాజు, నల్లం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

యాసిడ్ పడి పేపర్‌మిల్ కార్మికుడికి గాయాలు

రాజమహేంద్రవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలోని పేపర్ మిల్లులోని ఓ కార్మికుడికి ప్రమాదవశాత్తూ తీవ్ర గాయాలయ్యాయి. సదరు కార్మికుడు గురువారం మధ్యాహ్నం సమయంలో బాయిలర్ వద్ద విధులకు హాజరయ్యాడు. ఒక్కసారిగా బాయిలర్‌లోని మంటలు వచ్చి యాసిడ్ పొంగి కార్మికుడి తలపై పడింది. దీంతో తల, ముఖంపై తీవ్రంగా కాలిన గాయాలయ్యాయి. ప్రస్తుతం నగరంలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై పేపర్ మిల్లు నుంచి ఎలాంటి ప్రకటనా వెలువడలేదు. సిబ్బందికి యాజమాన్య ఆదేశాలతో గోప్యత పాటిస్తున్నారని తులస్తోంది. పేపర్ మిల్లులోని కార్మికుల భద్రతపై అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తమవుతోంది.

కవులు కలాలకు పదును పెట్టాలి

నన్నయ ప్రొఫెసర్ తరపట్ల సత్యనారాయణ


సమావేశంలో మాట్లాడుతున్న తరపట్ల సత్యనారాయణ

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 21: నేటి సమాజ సమస్యలపై స్పందిస్తూ కవులు తమ కలాలకు పదును పెట్టాలని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఆచార్యులు తరపట్ల సత్యనారాయణ అన్నారు. ప్రపంచ కవిత దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగుశాఖ, కళాగౌతమి సంయుక్త నిర్వహణలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రణమిల్లే కలాలు కాదు, పదునెక్కిన కలాలు రావాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఏబెల్ రాజబాబు, తెలుగుశాఖాధిపతి పీవీబీ సంజీవరావు, అధ్యాపకులు శ్రీనివాస్, ఎస్.రాజ్‌కుమార్, పల్లి సుధా, ఎం.లలిత రమ్య ఏ.సరళ, ఎన్.సుబ్రహ్మణ్యేశ్వరి, సీతారామనాయుడు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో చిత్రలేఖనం పోటీలు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 21: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో గురువారం పాఠశాలల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. రాజమహేంద్రవరం సిటీతో పాటు పరిసర పాఠశాలల నుంచి సుమారు 120 మంది విద్యార్థులు సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల పోటీల్లో పాల్గొన్నారని ప్రిన్సిపాల్ రామచంద్ర తెలిపారు. గెలుపు ఓటములతో సంబంధంలేకుండా అనుభవాన్ని పొందడం, తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం వంటి ప్రధానమైన విలువలు విద్యార్థులు పొందవచ్చన్నారు. జేఎస్‌డబ్ల్యు పెయింట్స్ ఫ్యూచర్ స్కేప్స్ - ది హిందూ యంగ్ వరల్డ్ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. కార్యక్రమంలో ది హిందూ రీజనల్ హెడ్ ఐవీఎస్ పార్థసారథి, అసిస్టెంట్ మేనేజర్ దుర్గా మల్లేశ్వరరావు, ఆర్ట్స్ కళాశాల వివిధ విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

శాలివాహనులు ఐకమత్యంతో ఉండాలి


దామిరెడ్డిపల్లిలో శాలివాహన జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

కడియం, మార్చి 21: శాలివాహన సంఘ సభ్యులు ఐకమత్యంతో ఉంటూ రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని కుమ్మర శాలివాహన సంఘ ప్రచార కమిటీ రాష్ట్ర చైర్మన్ దాలిపర్తి వేమన తెలిపారు. శాలివాహన చక్రవర్తి జయంతి కార్యక్రమం గురువారం మండలంలోని వీరవరం, దామిరెడ్డిపల్లి గ్రామాల్లో జరిగింది. కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన వేమన మాట్లాడుతూ మట్టి ప్రతిమలకు ప్రాణం పోసి వాటినే సైన్యంగా ఉపయోగించి ఉజ్జయిని రాజ్యాన్ని పరిపాలించిన విక్రమాదిత్య చక్రవర్తిని ఓడించిన వారే శాలివాహన చక్రవర్తి అన్నారు. కార్యక్రమంలో మంతెన శ్రీనివాస్, గాది చంద్రశేఖర్, టిల్లపూడి భైరవమూర్తి, మానేపల్లి కపిలేశ్వరరావు, మాచవరపు వెంకటేశ్వరరావు, పేరూరి సూర్యనారాయణ, గంగుల మర్తి సుబ్బన్న, దేవగుప్తపు పురుషోత్తం, టెక్కలి సత్యనారాయణ, టిల్లపూడి శ్రీను పాల్గొన్నారు.

భాస్కర్‌దేవ్‌కు అక్కినేని అవార్డు

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 21: మహోన్నత నటనతో అభిమానుల గుండెల్లో సుస్థిర స్థానం పొందిన నట సామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు జీవితం ఆదర్శనీయమని అక్కినేని శత జయంతి సంవత్సరం సందర్భంగా గురువారం రాత్రి స్థానిక జిత్ మోహన్ మిత్రా కళావేదిక వద్ద అభిమానులు ఘనంగా ఉత్సవ సభ నిర్వహించారు. నట గాయకుడు జిత్‌మోహన్ మిత్రా అధ్యక్షత వహిస్తూ, అక్కినేనితో అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. బీవీ భాస్కర్‌దేవ్‌ను అక్కినేని అవార్డుతో సత్కరించారు. నూజెళ్ల సూరిబాబు వ్యాఖ్యాతగా వ్యవహరించారు. సుక్కురెడ్డి శ్రీనివాసరావు, శేషగిరిరావు, ప్రసాద్, గుంటూరు శ్రీనివాసరావు, ఎస్.లక్ష్మిఆదిత్య పులవ రామకృష్ణ పాల్గొన్నారు.

4వ రోజు త్యాగరాజ సంగీతోత్సవాలు



సూర్యగాయత్రీ గాత్రం ఆలపిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్, మార్చి 21: త్యాగరాజ్‌నగర్‌లో శ్రీత్యాగరాజ నారాయణదాస సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంగీత వార్షికోత్సవాలు 4వ రోజు గురువారం ఘనంగా జరిగాయి. విశ్వనాథం అచ్యుత రామయ్య సంస్మరణార్థం ఆయన సతీమతి కామేశ్వరి, కుమారుడు భాస్కర్‌రామ్, కోడలు సుచిత్రా భాస్కర్‌రామ్ సౌజన్యంతో ఈ వార్షికోత్సవాలు నిర్వహించారు. కాలికట్‌కు చెందిన సూర్యగాయత్రి గాత్రం ఆలపించారు. విశాఖపట్నానికి చెందిన మంతా శ్రీరమ్య వయోలిన్, కాలికట్‌కు చెందిన పీవీ.అనిల్‌కుమార్ మృదంగం, గుంటూరుకు చెందిన ఎం.హరిబాబు ఘటంలో నైపుణ్యం ప్రదర్శించారు. సంగీత ప్రియులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.


జనసేలో చేరికలు



రాజానగరం, మార్చి 21: మండలంలో పలు గ్రామాలకు చెందిన వైసీపీ నాయకు లు, కార్యకర్తలు గురువారం జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారిని పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వైసీపీ నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ దేశాల శ్రీను ఆధ్వర్యంలో చప్పిడి బూరయ్య, చప్పిడి శ్రీనివాస్, సత్తిబాబు, పెద్ద, జనార్థన్, రాజు, వెంకన్న, యాదమరెడ్డి పెద్దనర్సింహం, తదితరులు జనసేనలో చేరిన వారిలో ఉన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

శుక్రవారం 22 మార్చి 2024 | 5

రంజాన్ వేళలు

ఇఫ్తార్ (శుక్ర) సా.6.23

సహార్(శని) ఉ.4.44

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
రాజమండ్రి	36.0	22.0

వలంటీర్లపై వేటు



ఎన్నికల కమిషన్ ఆదేశాలు బేఖాతర్ చేశారు.. ఎప్పుడూ పిలిచినట్టే నాయ కుడు పిలిచాడు కదా అని ఎరక్కపోయి వెళ్లి ఇరుక్కుపోయారు.. రాజ మహేంద్రవరం ఎంపీ భరత్‌రామ్ అత్యుత్సాహానికి ఏకంగా 23 మంది వలంటీర్లు బలైపోయారు. దిక్కుతోచని స్థితిలో వలంటీర్లు గిజగిజలాడి పోతు న్నారు. నేతల ఒత్తిళ్లకు లొంగి చివరకు బలి పశువులుగా మారిపోయారు. అయితే సమావేశం నిర్వహించిన ఎంపీ భరత్‌పై నేటి వరకూ చర్యలు లేకపోవడంపై వలంటీర్లు మండిపడుతున్నారు.

23 మంది సస్పెన్షన్

- ఈసీ ఆదేశాలు బేఖాతర్
- ఎంపీ మీటింగ్‌కు వెళ్లడమే కారణం
- ఆర్‌వోకు అందిన ఫిర్యాదు
- 24 గంటల్లో విచారణ పూర్తి
- 44వ డివిజన్ వలంటీర్లపై చర్యలు
- ఎంపీని వదిలేసిన అధికారులు?
- విచారణ పేరుతో జాప్యం
- మండిపడుతున్న బాధితులు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఎన్నికల సమయంలో వలంటీర్లను వినియోగించవద్దని ఎన్నికల కమిషన్ ప్రత్యేకించి హెచ్చరించినా వైసీపీ నేతలు పట్టించుకోవడం లేదు. రాజమహేంద్రవరంలో ఈ నెల 19వ తేదీన ఎంపీ భరత్ రామ్ నిర్వహించిన రహస్య సమావేశానికి 44 డివిజన్‌కు సంబంధించిన 23 మంది వలంటీర్లు వెళ్లారు. ఇదే పెద్ద చిక్కు తెచ్చి పెట్టింది. వలంటీర్ల సస్పెండ్ చేయించింది. 44వ వార్డు 76వ సచివాలయంలో 10 మంది, 77వ సచివాలయంలో 13 మంది వలం టీర్లను సస్పెండ్ చేసినట్టు ఆర్‌వో దినేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. వలంటీర్లను ఇప్పటి వరకూ పింఛన్లు పంపిణీ, అధికార వైసీపీకి అవసరమైన సమాచారాన్ని సేకరించడం తదితర కార్యక్రమాలకు ఉపయోగించుకున్నారు. వైసీపీ మీటింగ్‌లకు వాళ్లే కీలకంగా వ్యవహరించేవారు. చాలా వరకూ జనసమీకరణ చేసేవారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో కోర్టు ఆదేశాలతో వలంటీర్లు ఎన్నికలకు దూరం ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడే వైసీపీ నాయకులకు అసలు చిక్కు వచ్చిపడింది. నిన్నటి వరకూ నాయకులు కార్యకర్తలను పట్టించుకోకుండా వలంటీర్లకే పెద్దపీట వేసేవారు.వైసీపీ కార్యకర్తలను పట్టించుకోలేదు. దీంతో ఎన్నికల వేళ వైసీపీ నాయకులు ప్రచారం చేయడానికి డబ్బులిస్తేనే కానీ కార్యకర్తలు ముందుకు రాని పరిస్థితులు ఉన్నాయి.

కార్యకర్తలు కినుక..

వార్డులు, గ్రామాల్లో ఎక్కువ మంది వలంటీర్లకే పరిచయం. పింఛన్లు, ప్రభుత్వ పథకాలపై అమలుపై గత ఐదేళ్లుగా జనంతో ఉన్నారు. దీంతో ఎమ్మెల్యే ఎంపీ అభ్యర్థులంతా ప్రతి విషయానికి వలంటీర్ల మీదే ఆధారపడుతున్నారు. అయితే వలంటీర్లను ఎన్నికల్లో దూరంగా ఉంచాలని కోర్టు ఆదేశించడంతో వైసీపీ గొంతులో వెలక్కాయ పడినట్టు అయింది. కానీ దేన్నయినా ధిక్కరించే నైజం అలవరచుకున్న కొందరు వైసీపీ నేతలు వలంటీర్ల మీద ఒత్తిడి తెచ్చి ఇంటింటా ప్రచారం చేయించుకునే పనిలో ఉన్నారు. అధికార వైసీపీ నేతల ప్రలోభాలకు,ఒత్తిళ్లకు లొంగి వైసీపీ మీటింగ్‌లకు హాజరవుతున్నారు. ఈ వ్యవహారం బయటకు వస్తుండడంతో వలంటీర్లు ఎన్నికల కమిషన్ వేటుకు గురవుతున్నారు.

వల వేసినా..

వలంటీర్లుగా పనిచేస్తూ ప్రభుత్వం నుంచే ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల రూపంలో గౌరవ వేతనం పొందుతున్నారు.ఈ పరిస్థితుల్లో వలంటీర్లు రాజకీయ పార్టీకి ఎలా పనిచేస్తారని ప్రశ్నించి వారిని ఎన్నికల కమిషన్ దూరం పెట్టిన సంగతి తెలిసిందే. నాయకులతో కలిసి వెళితే కేసులు పెడతామని,జైలుకు పంపిస్తామని హెచ్చరించింది. జిల్లాలో 9300 మంది వలంటీర్లు ఉండేవారు. ప్రస్తుతం 8 వేల మంది ఉన్నారు. వారందరికీ ఇటీవల వైసీపీ నేతలు నియోజకవర్గాల వారీ గిఫ్ట్‌లు పంపిణీ చేసిన సంగతి తెలిసిందే. ఎన్నికలు దగ్గరకు వచ్చే సమయంలో డబ్బు కూడా ఇస్తామని ప్రలోభాలు పెట్టిన సంగతి తెలిసిందే. ఇటీవల సిటీ వైసీపీ అభ్యర్థి, ఎంపీ మార్గాని భరత్ బూత్‌కమిటీ పేరుతో ఏర్పాటు చేసిన మీటింగ్‌లకు వలంటీర్లు హాజరయ్యారు.ఈ విషయం బయటకు రావడంతో పాటు టీడీపీ అభ్యర్థి ఆదిరెడ్డి వాసు కమిషనర్, సిటీ ఆర్వో కె.దినేష్‌కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయన ఆరా తీసి 23 మంది వలంటీర్లను సస్పెండ్ చేశారు. దీంతో వలంటీర్లతో పాటు వైసీపీ ఖంగుతిన్నది. ఈ నేపథ్యంలో మిగతా వలంటీర్లు అలర్ట్ అయ్యారు. గతంలో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించిన ఉద్యోగుల్లో కూడా ఆందోళన మొదలైంది. ఇటీవల భూములు సేకరించకుండానే వేలాది మంది లబ్ధిదార్లకు పట్టాలు పంపిణీ చేసిన రెవెన్యూ అధికారులపై కూడా ఫిర్యాదులు చేయడానికి ప్రతిపక్షాలు సిద్ధమవుతుండడం గమనార్హం.

ప్రచారానికి అనుమతి తప్పనిసరి

సువిధ వెబ్ పోర్టల్ అనుమతిపై 25 అంశాల్లో చెక్‌లిస్ట్

రాజమహేంద్రవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం ప్రచారాలకు రాజకీయ పార్టీల నాయకులు 'సువిధ' వెబ్ పోర్టల్ ద్వారా అనుమతి కచ్చితంగా పొందాలని అడిషనల్ ఎస్పీ పి.అనిల్ కుమార్ పేర్కొన్నారు. ఇంటింటి ప్రచారం, ర్యాలీ, బైక్ ర్యాలీ ఇలా మొత్తం 25 అంశాల్లో చెక్‌లిస్ట్ ఉందని చెప్పారు. అనుమతులు పొందకుండా కార్యక్రమం నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇప్పటికే జిల్లాలో ఐపీసీ సెక్షన్ 188, ఇండియన్ పోలీస్ చట్టంలోని సెక్షన్ 30 అమల్లో ఉన్నాయని చెప్పారు. పోలీసులు ముందస్తు అనుమతుల్లేకుండా ర్యాలీలు,సభలు, సమావేశాలు నిర్వహించడం నిషిద్ధమన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా ఎలాంటి పనులు చేసినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఆసరా, అంతేగా!



బటన్ నొక్కి మూడు వారాలైనా అందని సొమ్ములు

- లబ్ధిదారుల ఎదురుచూపులు
- 50 శాతమూ జమకాని వైనం
- జిల్లాలో 32,707 గ్రూపులు
- జమైన వారి లెక్కలూ లేవు
- వస్తుందో రాదోనని ఆందోళన
- ఎన్నికల వేళ ఓటు రాజకీయం?
- నగదు జమైతే..ఓటుకు లింక్..
- డ్వాక్రా మహిళలకు ఇదో ఎర

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

తెల్లారితే అప్పులతో ముఖం కడుక్కొనే దుస్థితిలో ఉన్న జగన్ జమానాలో బటన్ నొక్కినంత వేగంగా, సులభంగా పనులు మాత్రం జరగడం లేదు. ఈ నాలుగేళ్ల పది నెలల పాటు రుణాలతో దర్పం ప్రదర్శిస్తూ వచ్చారు. దొరికిన చోటల్లా చేయి చాచారు. చివరికి భవిష్యత్తులో విక్రయించే మద్యంపై కూడా అప్పు లాగేసినా, సచివాలయాలను తాకట్టు పెట్టేసినా అది వైసీపీ సర్కారుకే చెల్లింది. ఇప్పుడు ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో జగన్ ప్రభుత్వంలో గల్లాపెట్టే డొల్లతనం బయట పడుతోంది. పైసా పుట్టడం కష్టతరం కావడంతో 'ఆసరా' సొమ్ములు నీరసంగా జమ అవుతున్నాయి. నాలుగో విడత ఇదిగో అంటూ జగన్ బటన్ నొక్కి మూడు వారాలు గడిచినా 50 శాతం మందికి కూడా రుణమాఫీ సొమ్ములు బ్యాంకుల్లో జమ కాలేదు.

అసలు వస్తుందా?

ప్రభుత్వం వద్ద సొమ్ములు లేవనే విషయం బహిరంగ రహస్యం. ప్రతి రోజూ అప్పులు చేస్తే గానీ పూట గడవని దుస్థితిలో ఆర్థికం కొట్టుమిట్టాడుతోంది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దొరికిన చోటల్లా అప్పులు చేస్తూ వచ్చారు. ఈ నెల 16 నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేసింది. ఇప్పటి వరకూ అధికారాన్ని అడ్డుపెట్టుకుని చేయి చాచడంతో నయానో, భయానో రుణం పుట్టేది. జగన్ ప్రభుత్వంపై నమ్మకం లేకపోవడంతో ఇప్పుడు రుణదాతలు పైసా విదిల్చే పరిస్థితి లేదు. ఆ ప్రభావం పథకాలపై పడుతోంది. ఆసరా రుణమాఫీ సొమ్ములు నాలుగో విడత విడుదలకు మార్చి 1న జగన్ ఆర్భాటంగా ఎప్పుడు మాదిరిగానే బటన్ నొక్కి నాలుగు మాటలు చెప్పి ప్యాలెస్‌కి వెళ్లిపోయారు. తర్వాత ఆ సొమ్ములు జమ చేయడానికి సాంకేతిక కారణాలు చూపిస్తూ కాలాన్ని గెంటుతున్నారు. ఎన్నికల సంఘం చెప్పినా లెక్కచేయకుండా వలంటీర్లను ఎన్నికల ప్రచారానికి వినియోగిస్తుండడంతో కేవైసీ తదితర అడ్డంకులు దాటడానికి లబ్ధిదారులు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నారు. 2020-21 నుంచి నాలుగు విడతలుగా రుణమాఫీ సొమ్ములు జమ చేస్తామని జగన్ చెప్పారు. ఏడాదికి ఒక విడత చొప్పున జమ చేస్తున్నారు. ఈ నెలలో చివరి విడత జమ కావాల్సి ఉంది. దీనిలో భాగంగానే సీఎం బటన్ నొక్కారు. అయితే నేటికీ డబ్బులు జమకాలేదు.

జిల్లాలో 32,707 గ్రూపులు

తూర్పు గోదావరి జిల్లాలో నాలుగో విడతకు సంబంధించి 32,707 గ్రూపుల్లో 3,27,070 మందిని ఆసరా(వైఎస్ఆర్‌కేపీ) లబ్ధిదారులుగా గుర్తించారు. వీరికి సంబంధించి బ్యాంకు ఖాతాల్లో రూ.1105.87 కోట్లు జమ కావాల్సి ఉంది. కానీ 50 శాతం కూడా పూర్తి కాలేదని తెలుస్తోంది.

> **ప్రలోభానికా..?**
>
> ఎన్నికల సందర్భంగా ఏ ప్రలోభాన్నీ వైసీపీ ప్రభుత్వం వదలడం లేదు. ఏ పథకంలో అర్హుదారులనైనా ఓటుతో ముడిపెడుతున్నారు. నాలుగేళ్ల పది నెలల్లో సంక్షేమ పథకాల ద్వారా పరోక్షంగా, ప్రత్యక్షంగా చేసిన సహాయాన్ని లెక్క గట్టి సొంత సొమ్ము ఇచ్చినట్టుగా బిల్డప్ ఇస్తున్నారు. కుడి చేతిలో సొమ్ము పెట్టి ఎడమ చేతితో లాగేసుకోవడం వైసీపీ ప్రభుత్వంలో మరో మెలిక. ఇప్పుడు ఆసరా సొమ్మును కూడా ఓట్లతో బేరీజు వేస్తున్నారు. ఆసరా సొమ్మును నెమ్మదిగా వేస్తూ జమ అయిన లబ్ధిదారుల వద్దకు వెళ్లి ఓటు వేయాలంటూ డిమాండ్ చేయాలని వైసీపీ నాయకులు వలంటీర్లు, ఆర్పీలు, సీఆర్పీలపై ఒత్తిడి తెస్తున్నారని సమాచారం. దీంతో బ్యాంకు ఖాతాలో జమ అయిన వారి వివరాలు తెలుసు కుని ఓటు వేయాలని లేకపోతే ఈ లబ్ధి ఉండ దంటూ ప్రలోభ పెడుతున్నారు. ఎన్నికల సమ యం ఆసన్నమయ్యే వరకూ ఇలా కాలయాపన చేస్తే ఓట్లు దండుకోవచ్చనే కుయుక్తి ఈ పథ కంలోనూ ఉందనే ఆరోపణలు వినవస్తున్నాయి.

మండలాల వారీగా చూస్తే.. అనపర్తి 1310, బిక్కవోలు 1522(మొదటి విడతలో 1523), చాగల్లు 1234, దేవరపల్లి 1660(1661), గోకవరం 1465, గోపాలపురం 1465, కడియం 1538, కోరుకొండ 1575, కొవ్వూరు 1324(1325), నల్లజర్ల 1620, నిడదవోలు 1438, పెరవలి 1531, రాజమహేంద్రవరం రూరల్ 2635, అర్బన్ 3997, రాజానగరం 2089, రంగంపేట 1170, సీతానగరం 1632, తాళ్లపూడి 1117, ఉండ్రాజవరం 1299(1300), కొవ్వూరు 545, నిడదవోలులో 540 గ్రూపుల్లోని మహిళలకు రుణమాఫీ జమకావాల్సి ఉంది. కానీ ఏ ఒక్క మండలంలోనూ పూర్తి స్థాయిలో ఇప్పటి వరకూ ఆసరా అందలేదు.

ఎందుకు గోప్యత

ఆసరా ఎందరి ఖాతాల్లో జమ చేశారన్న విషయం గోప్యంగా ఉంచుతున్నారు. ఖాతాలో నేరుగా జమ చేస్తున్నందున సదరు లబ్ధిదారుడికి మాత్రమే ఫోన్ ద్వారా సమాచారం అందుతుందని తమ వద్ద వివరాలు ఉండవని, అందువల్ల లెక్కాపత్రం తెలియదని అధికారులు సమాధానమిస్తున్నారు. మరోవైపు తమ పరిధిలో ఉన్న గ్రూపుల్లో ఎందరికి రుణమాఫీ సొమ్ములు పడ్డాయో రిసోర్స్ పర్సన్(ఆర్పీ)లకు కూడా తెలియదంట. దీంతో నెమ్మదిగా జమ చేస్తున్నారనే సమాధానం ఎదురవుతోంది. జిల్లాలో ఇప్పటి వరకూ ఎంత మందికి రుణమాఫీ నాలుగో విడత వర్తించిందో, ఇంకా ఎందరు ఎదురు చూస్తున్నారో జిల్లా స్థాయి అధికారులకు తెలియదు.

పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు ఉండాలి

జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ ఆదేశం



రాజమహేంద్రవరం రూరల్ మార్చి 21 : రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రూరల్ నియోజకవర్గ పరిధిలో ఉన్న అన్ని పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని రూరల్ ఆర్వో, జేసీ తేజ్ భరత్ ఆదేశించారు. రూరల్ మండల పరిధి కోలమూరులో గల పోలింగ్ స్టేషన్-40ని అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బూత్ స్థాయి అధికారి పేరు, ఫోన్ నెంబరు అందుబాటులో ఉంచాలన్నారు. పోలింగ్ కేంద్రంలో బాత్‌రూమ్‌లు లేవంటూ ఫిర్యాదు రావడంతో తక్షణమే వాటిని ఏర్పాటు చేయాలంటూ అధికారులను ఆదేశించారు. పోలింగ్ కేంద్రం పరిధిలో 85 ఏళ్ల దాటిన ఓటర్ల వివరాలను సేకరించి ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. హోం ఓటింగ్‌కు కోసం అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు.ఆయన వెంట రూరల్ తహసీల్దార్ అప్పారావు, జిల్లా సహకార అధికారి వై.ఉమామహేశ్వరరావు ఉన్నారు.

గజలక్ష్మిగా పాత సోమాలమ్మ



రాజమహేంద్రవరంకల్చరల్ మార్చి21 : పాత సోమాలమ్మ జాతర మహోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి.ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు గురువారం అమ్మ వారు గజలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. మహిళా భక్తులు కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం శ్రీ మహాగురు స్థాన్ వారిచే సాయిబాబా భజన, అమ్మవారి పురవీధుల పల్లకీ సేవతో నిర్వహించారు. రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి,గుడా మాజీ చైర్మన్ గన్ని కృష్ణ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త మాజీ కార్పొరేటర్ గొర్రెల సురేష్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. 24వ తేదీ వరకూ ఉత్సవాలు జరుగుతాయని తెలిపారు.

ఫ్యాన్ కింద.. గుబులు



సీఎం జగన్ వద్దకు రాజమహేంద్రవరం పంచాయితీ

- నేరుగా కలిసిన అసంతృప్తులు
- వినిపించిన వేణుగానం
- కనిపించిన రాజాకీయం
- సిటీలో బయటపడిన విభేదాలు
- ఎన్నికల వేళా కలవని నేతలు
- నేటికీ ఎడముఖం..పెడముఖం
- భరత్‌కు దూరం..దూరంగా

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వైసీపీలో గ్రూపులు రచ్చకెక్కాయి. రాజమహేంద్రవరం పంచాయితీ సీఎం జగన్ వద్దకు చేరింది. సిటీ పరిధిలో వైసీపీ పలు గ్రూపులుగా విడిపోయిన సంగతి తెలిసిందే.. చాలా కాలంగా విభేదాలున్నాయి. వైసీపీ సిటీ అభ్యర్థి ఎంపీ మార్గాని భరత్ రామ్‌తో పలువురు విభేదించి పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న సంగతి తెలిసిందే. ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం సిటీ కోఆర్డినేటర్‌గా ఉన్న సమయంలో ఎంపీ మార్గాని భరత్‌తో ఆయనకు పొసగలేదు. అప్పట్లో ఒకరిపై ఒకరు అధిష్ఠానానికి ఫిర్యాదు చేసుకునే స్థితికి చేరింది. ఆ సమయంలో అధిష్ఠానం వద్ద భరత్ మాట నెగ్గడంతో సిటీ కోఆర్డినేటర్ బాధ్యతల నుంచి సుబ్రహ్మణ్యం తప్పుకున్నారు.తర్వాత మాజీ ఎమ్మెల్యే ఆకుల సత్యనారాయణను కోఆర్డినేటర్‌గా నియమిస్తే ఆయన వ్యక్తిగత కారణాల వల్ల కొద్ది రోజులు మాత్రమే ఉన్నారు. తర్వాత భరత్‌కు అధిష్ఠానం ఈ బాధ్యతలు అప్పగించింది. అనంతర పరిణామాల నేపథ్యంలో కొంత కాలం కిందట వైసీపీలో చేరిన ప్రస్తుత లోక్‌సభ అభ్యర్థి గూడూరి శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. మరో పక్క రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజాకు సిటీపై పట్టు ఉంది. దీంతో ఎంపీ భరత్ వర్సెస్ ఎమ్మెల్యే రాజాగా మారిన సంగతి తెలిసిందే.అప్పట్లో జగన్ వద్ద పంచాయతీ జరిగింది. ఇద్దరికీ గట్టిగా చెప్పడంతో కొంతకాలం మౌనంగా ఉన్నారు. తర్వాత ఎవరి కథ వారిదే. సిటీ యువజన కాంగ్రెస్‌నేతగా పీతా రామకృష్ణను నియమించినప్పుడు తనకు తెలియకుండా నియమించడమేంటని, ఎమ్మెల్యే రాజా సోదరుడు గోదావరి జిల్లాల, వైసీపీ యూత్ కోఆర్డినేటర్ జక్కంపూడి రాజా ఎంపీపై ఫైర్ అయ్యారు. తర్వాత మిథున్‌రెడ్డి సమక్షంలో పీతా రామకృష్ణ, గణేష్ మధ్య గొడవ జరగడంతో మిథున్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి కూడా తెలిసిందే. ఈ పరిస్థితుల్లో రామకృష్ణను గణేష్ బెదిరించిన ఆడియో కూడా బయటకు రావడంతో ఎంపీ, జక్కంపూడి వర్గాల మధ్య విభేదాలు ఏ స్థాయిలో ఉన్నాయో అందరికీ అర్థమైంది. ఈ పంచాయతీ అంతా ఇలా ఉంటే ఎంపీ భరత్ సిటీ ప్రెసి డెంట్‌గా ఉన్న నందెపు శ్రీనివాస్‌ను తప్పించి తనకు అనుకూలంగా ఉన్న అడపా శ్రీహరికి ఇప్పించిన సంగతి కూడా తెలిసిందే.అంతే కాకుండా రుడా చైర్‌పర్సన్ షర్మిళారెడ్డి వర్గంతోనూ ఆయనకు విభేదాలు ఉన్నట్టు సమాచారం.దీంతో ఎంపీకి శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా వర్గం, నందెపు శ్రీని వాస్, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ మేడపాటి షర్మిళా రెడ్డి వర్గాలు దూరంగా ఉంటున్నాయి. ఎన్నికలు వచ్చేసినా వీరి మధ్య సఖ్యత కుదరలేదు. సిటీ అభ్యర్థి భరత్ మాత్రం ఈ వర్గాలు ఎవరూ తనకు అవసరం లేదని,తాను చేసిన పనులే గెలిపిస్తాయనే స్థాయికి వెళ్లిపోయి.. ఈ వర్గాలను పూర్తిగా వదిలేసినట్టు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఇటీవల సీఎం జగన్ భరత్‌కు వ్యతిరేకంగా ఉన్న వారిని తాడేపల్లి పిలిపించి మాట్లాడారు.దీనికి శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం, నందెపు శ్రీను, మంత్రి వేణు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఇటీవల వార్డు ఇన్‌చార్జిల నుంచి భరత్ తొలగించిన కొంత మంది నేతలు వెళ్లారు. మొదట శ్రీఘాకోళ్లపు, నందెపు వేర్వేరుగా జగన్‌ను కలిసి ఇక్కడ భరత్ ఒంటెద్దు పోకడల వల్లే సమస్య ఏర్పడిందని చెప్పినట్టు తెలిసింది. వైసీపీలో కష్టపడిన వారికి పదవులు ఇవ్వకుండా టీడీపీ నుంచి వచ్చిన వారికి పదవులు ఇచ్చారని, ఆధారాలతో కూడా చూపినట్టు సమా చారం.ఈ సమయంలో భరత్ మీద ఎన్ని చెప్పాలో అన్నీ చెప్పేసినట్టు తెలిసింది.అన్నీ విన్న తర్వాత ఎన్నికల సమయంలో ఐక్యం కాకపోతే దెబ్బతింటామని జగన్ హెచ్చరించినట్టు తెలిసింది. మిథున్ రెడ్డిని రాజమహేంద్రవరం పంపిస్తానని కూడా చెప్పినట్టు సమాచారం.ఈ నేతలంతా మూడు రోజుల కిందటే జగన్ కలిసినప్పటికీ.. స్థానికంగా నేత లలో ఏ మార్పు రాకపోవడం గమనార్హం. దీంతో వైసీపీలో గ్రూపిజం మరింత పెరిగినట్టు అయిం ది.ఈ పరిస్థితుల్లో వచ్చే ఎన్నికల్లో వైసీపీకి గడ్డుకాలమే.

ఎందుకో.. మార్పు!

రూరల్ గ్రామాలకు ప్రత్యేకాధికారుల మార్పు

హడావుడిగా ఉత్తర్వులు

నాయకుల విస్మయం

రాజమహేంద్రవరం రూరల్ మార్చి 21 : రాజమహేంద్రవరం రూరల్ మండలం పరిధిలో గ్రామ పత్యేకాధికారులను మారుస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీచేశారు. తొర్రేడు, కాతేరు గ్రామాలకు ఈవోపీఆర్‌డీ బాబూరావు, రాజవోలు, వెంకటనగరం, బొమ్మూరు గ్రామాలకు ఎంపీడీవో శ్రీనివాసరావును, పిడింగొయ్యి, కోలమూరు, హుకుంపేట, శాటిలైట్ సిటీ గ్రామాలకు జిల్లా పంచాయతీ అధికారి డి.రాంబాబును ప్రత్యేకాధికారులుగా నియమించారు. ఇప్పటివరకు కోలమూరు, ధవళేశ్వరం గ్రామాలకు ప్రత్యేకాధికారిగా ఉన్న రాజమహేంద్రవరం ఆర్డీవో చైత్రవర్షిణిని ధవళేశ్వరం గ్రామానికే పరిమితం చేసి కోలమూరు పంచాయతీని డీపీవోకు అప్పగించారు. రాజానగరం మండలం దివాన్‌చెరువు పంచాయతీకి డీఎల్‌పీవో ప్రత్యేకాధికారిగా ఉండేవారు. దివాన్‌చెరువుతో పాటు వెలుగుబంద పంచాయతీలకు డీపీవో రాంబాబును గ్రామ ప్రత్యేకాధికారిగా నియమిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అంత ఆఘమేఘాలపై ప్రత్యేకాధికారులను ఎవరి సిఫారసులపై, మార్చారో తెలియడంలేదని పలువురు మాజీ ప్రజాప్రతినిధుల విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కువ ఆదాయవనరులు ఉన్న గ్రామ పంచాయతీలకు డీపీవో, రూరల్ ఎంపీడీవోలను ప్రత్యేకాధికారులుగా నియమించారంటూ పలు ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

చిన్నారికి దెబ్బ తగిలితే.. కాలం చెల్లిన ఆయింట్‌మెంట్ పూశారు..

పెద్దదైన దెబ్బ.. సీడీపీవోకు ఫిర్యాదు



అనపర్తి,మార్చి 21 : మందులు వాడే సమయంలో ఎక్స్‌పైరీ డేట్ చూడడం అనేది ప్రధాన విధి. నిర్లక్ష్యంగా ఏదో మందు ఉంది కదా అని వాడా మా ఇలా ఇబ్బందులు తప్పదు. అనపర్తి మండలం రామవరం ఎస్సీ పేటలోని అంగన్‌వాడీ సెంటర్‌లో చిన్నారి పట్ల సిబ్బంది చూపిన నిర్లక్ష్య వైఖరి గురువారం వెలుగు చూసింది. అనపర్తి మండలం రామవరం ఎస్సీపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో దీపాశ్రీ చదువుకుంటుంది. ఈ నెల 18వ తేదీన సెంటర్‌లో ఉన్న గేటుపైకి ఎక్కి ఆడుకుంటూ గేటుపై నుంచి దీపాశ్రీ కిందకు పడిపోవ డంతో చేతికి గాయమైంది. అయితే సెంటర్‌లోని కార్యకర్త జె.లక్ష్మీకటాక్షం పాపను ఆసుపత్రికి తీసుకువెళ్లకుండా చేతికి కట్టుకట్టి కాలం చెల్లిన ఆయింట్‌మెంట్‌ను ఇచ్చి ఇంటికి పంపింది. మరుసటి రోజు తల్లిదండ్రులు కట్టువిప్పి కార్యకర్త ఇచ్చిన ఆయింట్‌మెంట్ పాప చేతికి పూశారు. అయితే పాపకు తగిలిన గాయం తగ్గకుండా పెద్దదైంది. కార్యకర్త ఇచ్చిన ఆయింట్ మెంట్‌ను పరిశీలించగా అప్పటికే అది కాలం చెల్లిందని గుర్తించిన తల్లిదండ్రులు అవాక్కయ్యారు. వెంటనే పాపను తీసుకుని ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లిన తల్లిదండ్రులు చిన్నారి చేతికి కుట్లు వేయించి చికిత్స చేయించారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తపై తల్లిదండ్రులు రంగంపేట సీడీపీవో జెస్సీ ఫ్లోరెన్స్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆమె అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మీకటాక్షంకు మెమో జారీ చేశారు.తక్షణమే వివరణ ఇవ్వాలని ఆమెను సీడీపీవో ఆదేశించారు.




విజిలెన్స్ ఎస్ఐ జగన్నాథరెడ్డి, హెచ్‌సీ జీవానందం, కానిస్టేబుల్ లోవరాజు

జిల్లా పోలీసులకు ఉగాది పురస్కారాలు

రాజమహేంద్రవరం, మార్చి 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు భద్రతా విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందికి గౌరవం దక్కింది. ఉగాది పురస్కారాలను ప్రకటిస్తూ ఆంధ్రప్రదేశ్ రాజపత్రం గురువారం రాత్రి విడుదల చేశారు. డీసీఆర్బీలో పనిచేస్తున్న ఏఎస్ఐ బీవీఆర్ వర్మకు ఉత్తమ సేవా పథకం లభించింది.ట్రాఫిక్ విభాగంలో కానిస్టేబుల్ జే.శ్రీనివాసరావు, కొవ్వూరు పీఎస్‌లో పనిచేస్తున్న హెచ్‌సీ కె.శ్రీనివాసరావు, ఉండ్రాజవరం పీఎస్‌లోని హెచ్‌సీ వై.నాగేశ్వరరావు సేవా పతకానికి ఎంపికయ్యారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం రాజమహేంద్రవరం ప్రాంతీయ కార్యాలయంలో పనిచేస్తున్న ఎస్ఐ టి.జగన్నాథరెడ్డి, హెచ్‌సీ డి.జీవానందం, కానిస్టేబుల్ డి.వెంకట సత్య లోవరాజు సేవా పథకాలు అందుకోనున్నారు. ఏపీ స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ రాజమహేంద్రవరం ఎయిర్‌పోర్టులో పనిచేస్తున్న ఎస్ఐ బీ.సన్యాసయ్యకు సేవా పథకం లభించింది.ఎస్పీ జగదీశ్, విజిలెన్స్ ఎస్పీ సుబ్బారెడ్డి, ఎస్పీఎఫ్ కమాండెంట్ కేఎస్.రావు అభినందనలు తెలిపారు. ఫైర్ సర్వీసుకు సంబంధించి ఉమ్మడి జిల్లాలోని కోనసీమ, కాకినాడకు చెందిన సిబ్బంది ఎంపిక కాగా తూర్పునకు చోటు దక్కలేదు.

తూర్పుగోదావరి
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

నేటి నుంచి నిర్మలగిరి పుణ్యక్షేత్ర ఉత్సవాలు



దేవరపల్లి, మార్చి 21: దేవరపల్లి మండలం గౌరీపట్నం నిర్మలగిరి మేరీమాత ఉత్సవాలు ఈ నెల 22 నుంచి 25వ తేదీ వరకు అత్యంత వైభవంగా నిర్వహించడానికి ఉత్సవ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ ఉత్సవాల్లో అన్ని మతాలకు అతీతంగా భక్తులు పాల్గొనడం విశేషం. హిందువులు కూడా ఈ ఉత్సవాల్లో పాల్గొని మొక్కుబడులు తీర్చుకుంటారు. తలనీలాలు సమర్పించడం, ముడుపులు సమర్పించడం చేస్తుంటారు. ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు పుణ్యక్షేత్ర డైరెక్టర్ జాన్ పీటర్ తెలిపారు.

ప్రజాప్రతినిధుల ఇళ్లలో పనిచేస్తున్న సిబ్బందిని వెనక్కి రప్పించాలి

మాలమహాసభ వర్కింగ్ ప్రెసిడెంట్ బొంతా శ్యాం

కొవ్వూరు, మార్చి 21: ప్రజా ప్రతినిధుల ఇళ్లలో పనిచేస్తున్న మున్సిపల్ సిబ్బందిని వెనక్కి రప్పించి, వారి వాస్తవ విధులకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని మాలమహాసభ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంటు బొంతా శ్యాం రవి ప్రకాష్ మున్సిపల్ కమిషనర్‌ను డిమాండ్ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ మున్సిపల్ సిబ్బందిని ప్రజా ప్రతినిధులు తమ ఇళ్లలో పనులకు ఉపయోగించుకోవడం కోడ్ ఆఫ్ కాండక్ట్ ఉల్లంఘన కిందకు వస్తుందన్నారు. దీనిపై ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తామన్నారు.

సిమెంటు బెంచీలు ఏర్పాటు

నిడదవోలు, మార్చి 21: రోటరీ సామాజిక సేవా కార్యక్రమాలకు పెద్దపీట వేస్తుందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు కీర్తి అంజనేయులు అన్నారు. గురువారం నిడదవోలు, తిమ్మరాజుపాలెంలోని పలు కూడళ్లలో ప్రజల సౌకర్యార్థం రోటరీ ఆధ్వర్యంలో సిమెంటు బెంచీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అంజనేయులు మాట్లాడుతూ నిడదవోలు, తిమ్మరాజుపాలెంలో ప్రజలు కూర్చునేందుకు దాతల సహకారంతో సిమెంటు బెంచీలను ఏర్పాటు చేశామన్నారు. దాతల ప్రోత్సాహంతో మండలంలోని అన్ని గ్రామాల్లో సిమెంటు బెంచీలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో గోపిరెడ్డి శ్రీనివాస్, గొన్నాబత్తుల రామారావు, అడ్డాల సత్యప్రభాకర్, శివకుమార్, రాంబాబు, పోలదాసు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధాన్యం దళారులకు విక్రయించి మోసపోవద్దు



కార్యక్రమంలో మాట్లాడుతున్న తహశీల్దార్ కృష్ణారావు

నల్లజర్ల, మార్చి 21: ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం దళారులకు విక్రయించి మోసపోవద్దని తహశీల్దార్ కృష్ణారావు, సివిల్ సప్లై డీటీ సత్యనారాయణ చెప్పారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై గ్రామ కమిటీ సభ్యులకు, రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ప్రతి రైతు రబీ పంటలో పండించిన ధాన్యం ఆర్‌బీకే కేంద్రంలో నమోదు చేయించుకుని గోనె సంచులు పొందాలన్నారు. ధాన్యం 17శాతం తేమ ఉండే విధంగా రైతులు ఆరబెట్టాలన్నారు. ధాన్యం విక్రయించిన 21 రోజుల్లో రైతు ఖాతాలో సొమ్ములు జామ చేస్తామన్నారు.

వైభవంగా మదన గోపాలుడి రథోత్సవం



తాళ్లపూడిలో రథాన్ని లాగుతున్న భక్తులు

తాళ్లపూడి, మార్చి 21: తాళ్లపూడిలో శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత మదన గోపాలస్వామి కల్యాణం బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. గురువారం రథోత్సవం జరిగింది. సర్పంచ్ నక్కా అనురాధ చిట్టిబాబు దంపతులకు, రథం దాతలు గోకవరపు వారి కుటుంబీకులకు కమిటీ సభ్యులు ఆహ్వానం పలికారు. అగ్నికుల క్షత్రియ పెద్దలు మల్లాడి పోసియ్య తదితరులు రథం తాళ్లను లాగగా హరినామ స్మరణతో భక్తులంతా రథాన్ని నడిపించారు. గ్రామ పుర వీధుల్లో మేళ తాళాలతో, కోలాట బృందాలు వెంట రాగా స్వామి వారి రథోత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ సింహాద్రి జనార్థనరావు, సభ్యులు మాణిక్యం, బాలాజీ, ఉమా, వినయ్, రాజు, రామకృష్ణ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కానూరులో ఫ్రైడే-డ్రైడే



కానూరులో నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

పెరవలి, మార్చి 21: కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా నిల్వ నీటిపై దోమగుడ్లు పెరుగుతాయని, పదో రోజు లోపు దోమలుగా మారతాయని తణుకు సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. దోమల నివారణకు ప్రతిఒక్కరూ నీరు నిల్వ ఉంచే డ్రమ్ములు, పాత్రలపై మూతలు ఉంచాలన్నారు. ఇంటి ద్వారాలు, తలుపులు, కిటికీలు తరచూ తెరిచి ఉంచొద్దని, కిటికీలకు దోమ తెరలు అమర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, విలేజ్ హెల్త్ సెక్రటరీలు రేవతి, వెంకాయమ్మ, అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పేకాడుతున్న 18 మంది అరెస్టు

కొవ్వూరు, మార్చి 21: పేకాట స్థావరంపై దాడిచేసి 18మందిపై కేసు నమోదు చేసినట్టు సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. మండలంలోని దొమ్మేరు గ్రామంలోని కల్యాణ మండపంలో పేకాట ఆడుతున్నారని సమాచారంతో పట్టణ పోలీసులు దాడిచేశారు. ఈ దాడిలో 18 మందిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి వారి నుంచి రూ.67,200 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు.. దొమ్మేరులో అనధికారికంగా మద్యం విక్రయిస్తున్న కొవ్వలి శ్రీనివాసరావును అరెస్టుచేసి అతడి నుంచి 6 బీరు బాటిళ్ల స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్టు సీఐ జగదీశ్వరారావు తెలిపారు.

గరుడ వాహనంపై నరసన్న గ్రామోత్సవం



కోరుకొండ, మార్చి 21: కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి వారు గరుడ వాహనంపై నాలుగు మాడ వీధుల్లో ఊరేగారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి, అమ్మవార్లకు పండ్లు, పుష్పాలు సమర్పించి మంగళహారతులిచ్చి ఆశీస్సులు అందుకున్నారు.

అలరించిన పండిత సభలు

నరసన్న కల్యాణోత్సవాల్లో భాగంగా రంగరాజస్వామి ఆలయ ప్రాంగణంలో విశిష్టాద్వైత పండిత సభలు జరిగాయి. ఉభయ వేదాంత పండితులు పరాసర లక్ష్మీనరసింహభట్టర్ స్వామి అధ్యక్షతన జరిగిన సభలో కందాడై శ్రీనివాసాచార్య, భద్రాచలం ఆస్థాన పండితుడు కందాడై మురళీకృష్ణ స్వామి రామాయణంలోని చరణం, భగవత్‌రామానుజ వైభవం, భారతీయ సనాతన సాంప్రదాయాలు, భారతీయ ఆలయ వ్యవస్థ, భగవద్గీత, బ్రహ్మసూత్రాలను వివరించారు.

తాళ్లపూడిలో వాహన తనిఖీలు

తాళ్లపూడి, మార్చి 21: ఎన్నికల కోడ్ అమలులో భాగంగా తాళ్లపూడి గోదావరి గట్టు వద్ద గురువారం ప్రత్యేక విభాగ బృందం, పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు రూ.50 వేల కంటే ఎక్కువ మొత్తంలో నగదు ఉంటే తగిన ఆధారాలు చూపాలన్నారు. నగదు అక్రమ రవాణా జరుగకుండా ప్రత్యేక విభాగం తనిఖీలు నిర్వహిస్తోంది.

ఎన్నికల నియమావళి పాటించాలి

- కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ
- రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన సదస్సు



అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శ్రీవాస్తవ

కొవ్వూరు, మార్చి 21: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తప్పకుండా అమలుపర్చాలని కొవ్వూరు సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో గురువారం వివిధ రాజకీయపార్టీల నాయకులకు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అవగాహనా సదస్సు నిర్వహించారు. మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలు తీరు, ప్రొసీజర్, సువిద యాప్, సి-విజిల్, ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంటు సిస్టమ్‌పై శిక్షణను అందజేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలును క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామన్నారు. ఎన్నికల ప్రచారం, తాత్కాలిక పార్టీ కార్యాలయాల ఏర్పాటు, రోడ్‌షోలు, కరపత్రాల పంపిణీ, లౌడ్ స్పీకర్లు, వాహనాలపై ప్రచారం ఇలా ప్రతిదానికి సువిద పోర్టల్‌లో 48గంటల ముందు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు అందిన 24గంటల్లో అనుమతి ఇస్తామన్నారు. 7శాఖలకు సంబంధించి సింగిల్ విండో విధానంలో ఆర్వో కార్యాలయంలోనే అనుమతులిస్తారన్నారు. అనుమతులు పొందడంలో సమస్యలు తలెత్తినా, అనుమానాలున్నా ఆర్వో కార్యాలయంలోని నోడల్ అధికారులను సంప్రదించాలన్నారు. అనుమతి లేకుండా ప్రచారం నిర్వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఎన్నికల ప్రచారంతో ప్రజల హక్కులకు, ట్రాఫిక్‌కు ఆటంకం కలిగించరాదన్నారు. రాజకీయ పార్టీల కార్యాలయాలు పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల దూరం లోపులోను, ఆక్రమిత భవనాల్లో ఏర్పాటు చేయరాదన్నారు. పార్టీ కార్యాలయాల్లో ఒక జెండా, 4:8 సైజు బ్యానర్ మాత్రమే ఉండాలని, వాహనాలపై ప్రచారంలో ఒక జెండాకు మాత్రమే అనుమతిస్తామని, జెండా కర్ర మూడడుగులకు మించరాదన్నారు. ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ర్యాలీలు చేపట్టాలన్నారు. ఎన్నికల ప్రచారంపై మార్చి 16వ తేదీ మధ్యాహ్నం నుంచి రాజకీయ పార్టీల ఖర్చులను అభ్యర్థుల ఖాతాల్లో నమోదు చేస్తామన్నారు. ఉదయం 6గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మాత్రమే ప్రచారం చేపట్టాలని, దిష్టిబొమ్మలు కాల్చడం, ఇతర పార్టీల నాయకుల ఇంటి ముందు ధర్నాలు చేపట్టరాదన్నారు. చర్చిలు, మసీదులు, దేవాలయాల వద్ద ప్రచారం చేయరాదన్నారు. ప్రసంగాల్లో వ్యక్తిగత దూషణ చేయరాదన్నారు. ప్రైవేటు ఇళ్లపై పెట్టిన పార్టీ జెండాలకు, బ్యానర్లకు అనుమతులు పొందాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ యశ్వంత్‌కుమార్, డీఎస్పీ కేసీహెచ్ రామారావు, ఎంపీఐ బి.స్వర్ణ శ్రీనివాస నాయక్, మున్సిపల్ కమిషనర్ కె.డానియల్ జోసఫ్, డీఎల్‌పీవో, ఆర్అండ్‌బీ ఈఈ, ఎలక్ట్రికల్, ఫైర్ అధికారులు, ఎన్నికల సిబ్బంది, రాజకీయ పార్టీల నాయకులు తలారి వెంకట్రావు, పొట్రు శ్రీనివాస్, గంధం బాపూజీ, బావన రాజేష్, బోడపాటి ముత్యాలరావు, ఎం.రామచంద్రరావు, నగళ్లపాటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా అమలు చేయాలి

గోపాలపురం, మార్చి 21: ఎన్నికల ప్రవర్తన నియామవళి కట్టుదిట్టంగా అమలు చేయాలని తహశీల్దార్ వనజాక్షి అన్నారు. స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమ పాఠశాలలో ఈవీఎంలు, వీవీ ప్యాడ్‌ల వినియోగంపై ఒక రోజు శిక్షణా కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నియమ నిబధనలతో పాటు కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీ ప్యాడ్‌లు సిద్ధం చేసే విధానంపై పూర్తిస్థాయిలో సెక్టోరియల్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. తహశీల్దార్ మాట్లాడుతూ ఓటర్లు నోటా బటన్, యూనిట్, బ్యాలెట్, వీవీ ప్యాడ్‌ల అనుసంధానంపై వివరించారు. సెక్టోరియల్ అధికారులు వాటిని ఎలా వినియోగించాలో శిక్షణ ఇస్తున్నామన్నారు. అధికారులకు ఎటువంటి సందేహం ఉన్నా ఉన్నతాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సువర్ణ, శిక్షకులు సుబ్రహ్మణ్యం, శంకరుడు, నాగేంద్రప్రసాద్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఓటును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలి

- డీఎస్పీ రామారావు.. కొవ్వూరు, చాగల్లు మండలంలో కవాతు



కొవ్వూరులో కవాతు నిర్వహిస్తున్న సీఐఎస్ఎఫ్ బలగాలు

కొవ్వూరు, మార్చి 21: ప్రతిఒక్కరూ స్వచ్ఛందంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని డీఎస్పీ కేసీహెచ్ రామారావు అన్నారు. కొవ్వూరులో మెరకవీధి వాటర్‌ట్యాంకు సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు సీఐఎస్ఎఫ్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం వద్ద సబ్ కలెక్టర్ ఆశుతోష్ శ్రీవాస్తవ, ట్రైనీ కలెక్టర్ యశ్వంత్‌కుమార్ కవాతులో పాల్గొని సూచనలు చేశారు. డీఎస్పీ రామారావు మాట్లాడుతూ ప్రజలు ఎటువంటి భయం లేకుండా ప్రతిఓటరు పోలింగ్ కేంద్రానికి వచ్చి స్వచ్ఛందంగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఓటర్లలో ఆత్మసైర్యం నింపడానికి జిల్లా ఎస్పీ ఆదేశాలతో కొవ్వూరు డివిజన్ పరిధిలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుదం లాంటిదని, దానిని దుర్వినియోగం చేయకూడదన్నారు. ఎవరైనా ప్రలోభపెట్టినా, భయాందోళనకు గురిచేసినా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐ వి.జగదీశ్వరరావు, ఎస్ఐలు జుబేర్ మహమ్మద్, కె.సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

చాగల్లు: మండలంలోని ఊనగట్ల, ఎస్.ముప్పవరం, మీనానగరం, చిక్కాలపాలెం గ్రామాల్లో కేంద్ర బలగాలతో కలిసి స్థానిక పోలీసులు కవాతు నిర్వహించారు. త్వరలో జరగబోయే సాధారణ ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో ఎటువంటి భయాందోళనలు లేకుండా, వారిలో ధైర్యం కలిగించి స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకొనేలా ప్రోత్సహించేందుకు ఈ కవాతు జరిపినట్టు సీఐ శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ పి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



చాగల్లు: ఊనగట్లలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

ప్రజాస్వామ్య వ్యవస్థలో జగన్ గంజాయి మొక్క

- గోపాలపురం కూటమి అభ్యర్థి మద్దిపాటి
- రెండో రోజు కొనసాగిన సంకల్ప యాత్ర



చిన్నాయిగూడెంలో మద్దిపాటి వెంకట్రాజుకు హారతులిస్తున్న మహిళలు

దేవరపల్లి/గోపాలపురం/నల్లజర్ల, మార్చి 21: ప్రజాస్వామ్య వ్యవస్థలో జగన్ రెడ్డి గంజాయి మొక్కలాంటి వాడని నియోజకవర్గ కూటమి అభ్యర్థి మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. గౌరీపట్నం నుంచి ద్వారకా తిరుమలకు చేపట్టిన సంకల్ప యాత్ర గురువారం రెండో రోజుకు చేరుకుంది. గోపాలపురం మండలం వాదాలకుంట గ్రామంలో పాదయాత్రగా బయల్దేరిన మద్దిపాటికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. వెదుళ్ళకుంట గ్రామశివారులోని శ్రీరేగులమ్మ ఆలయం వద్ద దేవరపల్లి మండలం యాదవోలులో ప్రవేశించారు. యాదవోలులో నుంచి చిన్నాయిగూడెం, సంగాయిగూడెం, యర్నగూడెం, సూర్యనారాయణపురం గ్రామాల్లో పాదయాత్రకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. మహిళలు హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రేగులమ్మ ఆలయం వద్ద ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి ప్రజల కష్టాలు తీరాలంటే కూటమి గెలుపోతోనే సాధ్యమన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మొలిచిన గంజాయి మొక్కలాంటి వాడు జగన్మోహన్‌రెడ్డి అని అభివర్ణించారు. ఓటమి భయంతో ఏం చేస్తున్నాడో తనకే అర్థం కావడంలేదన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కలయికతో తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రకంపనలు మొదలయ్యాయన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి డి.సువర్ణరాజు మాట్లాడుతూ జగన్ పాలనతో రాష్ట్రాభివృద్ధి 20 ఏళ్ల వెనక్కి వెళ్లిందని, టీడీపీ-జనసేన-బీజేపీ పాలనలో పోలవరం ప్రాజెక్టు పూర్తిచేస్తామని, భారీ పరిశ్రమలు తీసుకొస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో దేవరపల్లి టీడీపీ నాయకులు ఆంధ్రా అనీల్, సుదురుమాటి శ్రీనివాస్, పిన్నమనేని సత్యనారాయణ, పిన్నమనేని మధుమోహన్, జీఎంఏ కుమార్, చిలకా రాజేష్, ఆచంట శేషారావు, ఉప్పులూరి రాంబాబు, ఆచంట నాగేశ్వరరావు, గన్నమని హరికృష్ణ, పెనుమత్స సుబ్బరాజు, బొల్లిన భాస్కర్, జనసేన నాయకులు గంగరాజు, సలాది వేణుమాధవి, బీజేపీ నాయకులు నాగరాజు, కాట్రగడ్డ రవీంద్ర పాల్గొన్నారు. గోపాలపురం నుంచి టీడీపీ మండలాధ్యక్షుడు రుంగల సత్యనారాయణ, నూతంగి దొరబాబు, బీజేపీ మండలాధ్యక్షుడు గెల్లా శ్రీనివాసు, కాకర్ల శ్రీరామ్, వాడ్లమూడి రమేష్, జొన్నలగడ్డ ప్రసాద్, జ్యేష్ట శ్రీనివాసరావు, యండ్రప్రగడ మంగారావు, ఎంపీటీసీ కూనపం ప్రసాద్‌బాబు, భూరెడ్డి వాసు, రాము, కాకర్ల జగదీష్, గన్నిన మురళీ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతపల్లిలో బస.. మద్దిపాటి వెంకట్రాజు చేపట్టిన సంకల్పయాత్ర గురువారం రాత్రి అనంతపల్లి చేరుకుంది. గ్రామంలోని భాస్కరరావు కల్యాణ మండపంలో రాత్రి బస చేస్తారు. అనంతరం శుక్రవారం ఉదయం బయలుదేరి అచ్చెన్నపాలెం, నల్లజర్ల, పుల్లలపాడు, ముళ్ళకుంట, దూబచర్ల, ఘంటావారిగూడెం మీదుగా ద్వారకా తిరుమల మండలం మారంపల్లి చేరుకుంటుందని పార్టీ నాయకులు తెలిపారు.

ఉమ్మడి పోరాటంతో రాష్ట్ర ప్రజలకు మేలు

- కొవ్వూరు టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి

తాళ్లపూడి, మార్చి 21: టీడీపీ, బీజేపీ, జనసేన ఉమ్మడి పోరాటంతో రాష్ట్ర ప్రజలకు మేలు జరుగుతుందని, రాష్ట్ర భవిష్యత్తు కోసం ఒక ఎమ్మెల్యేగా కాకుండా మీతో కలిసి ఒక కార్యకర్తలా పనిచేస్తానని కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ-జనసేన-బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మండలంలోని మలకపల్లి, పెద్దేవం, తిరుగుడుమెట్ట, వేగేశ్వరపురం, తాళ్లపూడి, అన్నదేవరపేట గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశాల్లో ద్విసభ్య కమిటీ ఆధ్వర్యంలో మూడు పార్టీల కార్యకర్తలను, నాయకులను ఆయన కలిశారు. అన్నదేవరపేటలో అల్లూరి విక్రమాదిత్య నివాసం వద్ద పార్టీ అభిమానులను, కార్యకర్తలను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ముప్పిడి మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న జగన్‌మోహనరెడ్డిని ఇంటికి పంపించేందుకు కూటమి అభ్యర్థులను గెలిపించాలన్నారు. తనతో పాటు కొవ్వూరు సీటు ఆశించిన జవహర్ తనకు కావాల్సిన వ్యక్తి అని, ఆయనకు టీడీపీ అధిష్ఠానం మంచి భవిష్యత్తును ఇస్తుందని, ఈ విషయంలో తాను కూడా కృషి చేస్తానన్నారు. కార్యక్రమాల్లో కొఠారు వెంకట్రావు, కూచిపూడి జగపతి, కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణేష్, మద్దిపాటి రామారావు, మద్దిపాటి ప్రకాశం, కోడి శంకరం, బోడపాటి కాశీ, గంగరాజు, కైగాల శ్రీనివాస్ పాల్గొన్నారు.



తాళ్లపూడి: అన్నదేవరపేటలో విక్రమాదిత్య తదితరులతో ముప్పిడి

ఉమ్మడిగా విజయం సాధిద్దాం : కందుల దుర్గేష్



నిడదవోలు: అట్లపాడులో మాట్లాడుతున్న కందుల దుర్గేష్

నిడదవోలు, మార్చి 21: సార్వత్రిక ఎన్నికల్లో జనసేన-టీడీపీ-బీజేపీ ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థిగా అందరి సహకారంతో ఎన్నికలకు వెళుతున్నామని ఉమ్మడి ఎమ్మెల్యే కందుల దుర్గేష్ అన్నారు. గురువారం నిడదవోలు మండలం సమిశ్రగూడెం, అట్లపాడు గ్రామాల్లో జనసేన, టీడీపీ, బీజేపీ నాయకులు కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు మాట్లాడుతూ కలసి ఎన్నికలకు వస్తున్నామని, కచ్చితంగా గెలుస్తామని, ఉమ్మడి అభ్యర్థిగా కందుల దుర్గేష్‌ను గెలిపించుకోవడం అందరి బాధ్యత అన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు వెలగన సూర్యారావు, జనసేన మండలాధ్యక్షుడు పోలిరెడ్డి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మండలంలోని కాల్దరి, చిలకపాడు, దమ్మెన్ను, మోర్త గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో పరిచయ కార్యక్రమంలో ఇన్‌చార్జి బూరుగుపల్లి శేషారావు కందుల దుర్గేష్‌తో కలిసి పాల్గొన్నారు. నియోజకవర్గంలో ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న దుర్గేష్‌ను అఖండ మెజారిటీతో గెలిపించాలని శేషారావు అన్నారు. దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు ప్రభుత్వ విధానాలతో విసిగిపోయారని, ప్రజావ్యతిరేక పాలనను అంతమొందించాలని అన్నారు. తన గెలుపునకు ప్రతి ఒక్కరూ సహకరించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి భోగవల్లి ప్రసాద్, కోమట్లపల్లి వెంకటసుబ్బారావు, టీడీపీ మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, జనసేన మండలాధ్యక్షుడు వీరమళ్ల బాలాజీ, ఈర్పిన సత్యనారాయణ, బూరుగుపల్లి శ్రీనివాస్, రాచమళ్ల శ్రీనివాసరావు, బలుసు వెంకటరత్నం పాల్గొన్నారు.

ఎర్ర జెండా దిమ్మలు తొలగించొద్దు!

సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

రాజమహేంద్రవరం అర్బన్, మార్చి 21 : వచ్చే ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థులను గెలిపించాలని జిల్లా కార్యదర్శి తాటిపాక మధు కోరారు. కార్మికులకు చిహ్నంగా ఉండే సుత్తి, కొడవలి గుర్తు కల్గిన మేడే స్థూపాలను అధికారులు తొలగించేందుకు ప్రయత్నించడం అన్యాయమన్నారు. రాజమహేంద్రవరం సీపీఐ కార్యాలయంలో గురువారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఎన్ని చెప్పినా వలంటీర్లు వైసీపీ కార్యకర్తల్లా పనిచేస్తున్నారన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఎన్నడూ లేని విధంగా ఆయా వార్డుల్లో ఎర్రజెండా దిమ్మలను తొలగించాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సుత్తి, కొడవలి అనేది ప్రపంచ కార్మికులారా ఏకం కండి అని తెలియజేసేది తప్ప అది ఎన్నికల గుర్తు కాదన్నారు. సీపీఐ బృందం నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌ను కలిసి వైసీపీ కార్యకర్తల్లా పనిచేస్తున్న వలంటీర్ల లిస్టును, ఏయే వార్డుల్లో సుత్తి, కొడవలి దిమ్మలను కూల్చివేస్తున్నారో వాటి వివరాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కూండ్రపు రాంబాబు, నగర కార్యదర్శి వి.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

సభలు, సమావేశాలకు అనుమతులు తప్పనిసరి

ఈస్ట్‌జోన్ డీఎస్పీ కిశోర్‌కుమార్



బిక్కవోలు, మార్చి 21: త్వరలో జరగబోయే సాధారణ ఎన్నికల దృష్ట్యా రాజకీయ పార్టీల వారు సభలు, ఊరేగింపులకు ముందస్తు అనుమతులు పొందాలని ఈస్ట్‌జోన్ డీఎస్పీ ఎం.కిశోర్‌కుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈస్ట్‌జోన్ పరిధిలోని బొమ్మూరు, అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల్లో సెక్షన్ 30ని ఈనెల 1వ తేదీ నుంచి 30 వరకూ అమలులో ఉందని, రాజకీయ పార్టీల వారు బహిరంగ ప్రదేశాలు, రోడ్ల కూడళ్లు, మార్గాల్లో ఊరేగింపులు, సభలు, సమావేశాలు నిర్వహించాలనుకుంటే ముందస్తుగా సంబంధిత అధికారులకు రాత పూర్వకంగా దరఖాస్తు చేసుకుని అనుమతులు పొందాలన్నారు. అనుమతులు పొందకుండా చట్టాన్ని ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. వివాహం, అంత్యక్రియల సమయంలో జరిగే కార్యక్రమాలకు ఈ చట్టం వర్తించదని డీఎస్పీ పేర్కొన్నారు.

'ఇండియన్ యాక్ట్స్' అధ్యక్షుడిగా మణికుమార్

దివాన్‌చెరువు, మార్చి 21: ఇండియన్ యాక్ట్స్ అవేర్నెస్ వలంటరీ ఆర్గనైజేషన్ అధ్యక్షుడిగా తాను ఎంపికైనట్టు పెంటగట్ల మణికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల ఒకటో తేదీలోగా తన ఆధ్వర్యంలో ఐదుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. అలాగే రాష్ట్రంలోని అన్ని జిల్లాల కమిటీలు మే ఒకటో తేదీలోగా ఏర్పాటు చేయాలని తీర్మానించినట్టు పేర్కొన్నారు.

ప్రతి జీవికి అడవులతో అనుబంధం

రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ కృష్ణప్రియ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డైరెక్టర్ కృష్ణప్రియ

దివాన్‌చెరువు, మార్చి 21: ప్రపంచంలో ప్రతి జీవికి అడవులతో సంబంధాలుంటాయని ఏపీ రాష్ట్ర అటవీ అకాడమీ డైరెక్టర్ జి.కృష్ణప్రియ అన్నారు. దివాన్‌చెరువులోని రాష్ట్ర అటవీ అకాడమీలో ప్రపంచ అటవీ దినోత్సవాన్ని గురువారం నిర్వహించారు. ఈ ఏడాది అడవులు ఆవిష్కరణ-మెరుగైన ప్రపంచం కోసం కొత్త పరిష్కారాలు అనే థీమ్‌తో అటవీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు కృష్ణప్రియ వివరించారు. మనం తాగేనీరు, ఆహారం, మందులు, ఆశ్రయం, ఆక్సిజన్ కోసం అడవులతో సంబంధం కలిగి ఉంటాయని, అటువంటి అడవులను కాపాడేందుకు అటవీశాఖ కృషి చేస్తోందన్నారు. అలాగే ప్రజలు కూడా అడవులను పరిరక్షించుకునేందుకు తమ వంతు ప్రయత్నాలు చేయాలన్నారు. శిక్షణలో ఉన్న అటవీబీట్ అధికార్లు మాట్లాడుతూ ముఖ్యంగా మన రాష్ట్రంలో ఎర్రచందనం, పెద్దపులి, కలివి కోడి వంటి వాటిని ప్రతిఒక్కరు పరిరక్షించుకో వాలన్నారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వృక్షశాస్త్రం హెచ్‌వోడీ శ్రీనివాసరావు మా ట్లాడుతూ వృక్షశాస్త్రం, అటవీ విజ్ఞానాన్ని పెంపొందించడంలో తమ కళాశాల బోటనీ విద్యార్థులు కృషి చేస్తున్నారని, బోటనీ విభాగం అటవీశాఖతో సమన్వ యం చేసుకుని విద్యార్థులకు అటవీ ప్రాంతంలో అవగాహన కల్పిస్తున్నామన్నా మన్నారు. చివరిగా కళాశాల విద్యార్థులు, అధికారులు కలసి అటవీ సంర క్షణలో తమవంతు పాత్రను మనస్ఫూర్తిగా నిర్వహిస్తామని, పర్యావరణానికి ప్రతికూలమైన ఏ చర్యను చేపట్టబోమని ప్రతిజ్ఞ చేశారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

దివాన్‌చెరువు, మార్చి 21: రోడ్డు భద్రతా నియమాలను ప్రతిఒక్కరూ విధిగా పాటించాలని గైట్ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు కోరారు. గైట్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో దివాన్ చెరువులో గురువారం రహదారి భద్రతా కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, సీటుబెల్ట్ ధరించాలని సూచించారు.

శాలివాహనులు ఐకమత్యంగా ఉండాలి

కడియం, మార్చి 21: శాలివాహన సంఘ సభ్యులు ఐకమత్యంతో ఉంటూ రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని కుమ్మర శాలివాహన సంఘ ప్రచార కమిటీ రాష్ట్ర చైర్మన్ దాలిపర్తి వేమన తెలిపారు. శాలివాహన చక్రవర్తి జయంతి కార్యక్రమం గురువారం మండలంలోని వీరవరం, దామిరెడ్డిపల్లి గ్రామాల్లో జరిగింది. కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన వేమన మాట్లాడుతూ మట్టి ప్రతిమలకు ప్రాణం పోసి వాటినే సైన్యంగా ఉపయోగించి ఉజ్జయిని రాజ్యాన్ని పరిపాలించిన విక్రమాదిత్య చక్రవర్తిని ఓడించిన వారే శాలివాహన చక్రవర్తి అన్నారు. కార్యక్రమంలో మంతెన శ్రీనివాస్, గాది చంద్రశేఖర్, టిల్లపూడి భైరవమూర్తి, మానేపల్లి కపిలేశ్వరరావు, మాచవరపు వెంకటేశ్వరరావు, పేరూరి సూర్యనారాయణ, గంగులమర్తి సుబ్బన్న, దేవగుప్తపు పురుషోత్తం, టెక్కలి సత్యనారాయణ, టిల్లపూడి శ్రీను పాల్గొన్నారు.

జనసేలో చేరికలు

రాజానగరం, మార్చి 21: మండలంలో పలు గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు గురువారం జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బత్తుల బలరామకృష్ణ పార్టీలోకి ఆహ్వానించారు.